కూటమి ప్రభుత్వంలో కీలక పార్టీలైన తెలుగుదేశం, జనసేనలు జిల్లాకు కొత్త అధ్యక్షులను నియమించే అంశంపై కసరత్తు ముమ్మరం చేశాయి. రానున్న రోజుల్లో ఏర్పడనున్న మార్కాపురం జిల్లాను కూడా పరిగణనలోకి తీసుకుని అధ్యయనం చేస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగా అటు టీడీపీ, ఇటు జనసేన తమ పార్టీలకు చెందిన జిల్లాలోని నాయకులతో కూడా మంతనాలు ప్రారంభించాయి. టీడీపీ అధ్యక్షుడి అంశంపై ఆపార్టీ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్‌లు గత రెండు మూడు రోజులుగా విరివిగా సంభాషణలు ప్రారంభించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆపార్టీకి చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని సోమవారం ప్రత్యేకంగా పిలిపించుకుని ఈ విషయంపై మాట్లాడారు.



కొత్త సారథుల కోసం
కసరత్తు

టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు మార్పు!

- ప్రత్యామ్నాయ నేతలపై తెలుగుదేశం పరిశీలన
- బాలినేనితో మాట్లాడిన జనసేన అధినేత పవన్
- పరిగణనలోకి కొత్త జిల్లా ఏర్పాటు అంశం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాకు కొత్త అధ్యక్షుడి నియామకంపై టీడీపీ అధిష్ఠానం నుంచి పరిశీలకులను పంపించి గతంలోనే అభిప్రాయాలను సేకరించింది. జనసేన విషయానికి వస్తే ఆపార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రియాజ్ ఇటీవల ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. దీంతో ఆపార్టీకి కొత్త అధ్యక్షుడి నియామకం అనివార్యమైంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీలూ జిల్లా కమిటీల నియామకాలపై దృష్టి కేంద్రీకరించాయి.

టీడీపీ పరిశీలనలో ఉగ్ర, సత్య పేర్లు

తెలుగుదేశం పార్టీ గతంలో ఒంగోలులో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్ష పదవికి మూడు పేర్లను నాయకులు ప్రతిపాదించారు. కారణం ఏమైనా పార్టీ అధిష్ఠానం తాజాగా సరికొత్త పరిశీలన చేపట్టింది. ఆ పార్టీ తరఫున జిల్లా వ్యవహారాలను పరిశీలించే ఒకరిద్దరు నేతలు ఇటీవల జిల్లాలోని కొందరు నాయకులతో మాట్లాడారు. గతంలో జిల్లా నుంచి సూచించిన మూడు పేర్లు పక్కన పెట్టండి, ఇంకా ఎవరైనా సమర్థత కలిగిన నాయకులు ఉంటే సూచించాలని వారు అడిగినట్లు తెలిసింది. కొత్తగా ఏర్పడే మార్కాపురం జిల్లాను దృష్టిలో ఉంచుకోవడంతోపాటు ఆ పార్టీ లోక్‌సభను కూడా ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని అధ్యక్ష నియామకానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యన్నారాయణ (సత్య) పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గతంలో రాష్ట్ర పార్టీ నుంచి పరిశీలకులు వచ్చినప్పుడు జిల్లా అధ్యక్ష పదవికి ఒంగోలు, మార్కాపురం ఎమ్మెల్యేలు జనార్దన్, నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పేర్లను నాయకులు సూచించిన విషయం విదితమే. తాజాగా మాట్లాడుతున్న పార్టీ ప్రతినిధులతో జిల్లా నాయకులు ఆ విషయాన్ని గుర్తుచేయగా దాన్ని పక్కన పెట్టండి అని అన్నట్లు తెలిసింది. ప్రస్తుత అధ్యక్షుడు బాలాజీ మార్పు ఖాయమనే సంకేతాన్నిస్తూనే కొత్త అధ్యక్షుడి ఎంపికపై ఆపార్టీ కసరత్తు చేస్తోంది.



ఒంగోలు వస్తా

మాజీ మంత్రి బాలినేనితో భేటీ సందర్భంలో పవన్‌కల్యాణ్ త్వరలో ఒంగోలు వస్తానని చెప్పినట్లు తెలిసింది. వచ్చే నెల 4వ తేదీన పవన్ ఒంగోలులో అధికారిక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆ సమావేశం అనంతరం బాలినేని ఇంటికి భోజనానికి వస్తానని పవన్ చెప్పినట్లు సమాచారం. ఆ రోజు ఉమ్మడి జిల్లాలో కొందరిని జనసేనలో చేర్చేందుకు బాలినేని ప్రయత్నాలు ప్రారంభించారు.

బాలినేనితో చర్చించిన పవన్

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం మాజీ మంత్రి బాలినేనితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడి పదవిపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. వైసీపీ నుంచి జనసేనలో చేరిన బాలినేని కొంతకాలం నుంచి రాజకీయంగా మౌనవ్రతం పాటిస్తున్నారు. సోమవారం అధినేత నుంచి వచ్చిన పిలుపు మేరకు అసెంబ్లీలోని పవన్ చాంబర్‌లో బాలినేని ఆయన్ని కలిశారు. వారిద్దరూ మాట్లాడుకున్న అనంతరం బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డి కూడా పవన్‌ను కలిశారు. ఈ సందర్భంగా పవన్, బాలినేని మధ్య కొద్దిసేపు చర్చ నడిచింది. కొందరు ఎమ్మెల్సీల రాజీనామాల వ్యహారం హైకోర్టులో ఉంది. ఆ కేసు ఏ దశలో ఉందన్న అంశంపైన చర్చ జరిగినట్లు తెలిసింది. వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామాలకు ఆమోదం లభిస్తే జనసేన నుంచి ఒక ఎమ్మెల్సీ పదవిని బాలినేనికి కేటాయిస్తారన్న సమాచారం ఉంది. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య చర్చ జరగడం విశేషం. ఆ తరువాత జిల్లా అధ్యక్షుడి ఎంపిక ప్రస్తావన వచ్చినట్లు తెలిసింది. నిర్దిష్టమైన అభిప్రాయం వ్యక్తం కానప్పటికీ ఏ సామాజికవర్గానికి చెందిన వారికి అవకాశం ఇవ్వాలన్నదానిపై వారి మధ్య చర్చ నడిచినట్లు తెలిసింది. కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పడనున్న నేపథ్యంలో బాలినేని అభిప్రాయాన్ని ప్రత్యేకంగా పవన్ తెలుసుకున్నట్లు సమాచారం. తనకు తగిన అవకాశం ఇస్తే చురుగ్గా పనిచేసేందుకు సిద్ధమని బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డి చెప్పినట్లు తెలిసింది.

కారుమంచి మేజర్ కర్షకుల కడ'గండ్లు' | నాలుగేళ్ల క్రితం క్వారీ గుంతలోకి కూలిన కెనాల్ | పునరుద్ధరణను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం | ఎన్నికలనాటి హామీ అమలుకు ఎమ్మెల్యే బీఎన్ కృషి | టెండర్ల దశలో సీఈఈ అత్యుత్సాహంతో సీన్ రివర్స్ 6



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

'మీ కోసం'లో వినతుల స్వీకరణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదిక)లో ఆయన పాల్గొన్నారు. జేసీ గోపాలకృష్ణతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశతో వచ్చే అర్జీదారులను ఎట్టి పరిస్థితిల్లోనూ ఇబ్బంది పెట్టవద్దని మిగతా 6లో...

డీఎస్సీ అభ్యర్థులకు 25న నియామక పత్రాలు

అమరావతిలో సీఎం చేతుల మీదుగా అందజేత

ముందురోజు ఒంగోలులో రిపోర్టు చేయాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు ఈనెల 25న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అమరావతిలో నియామక పత్రాలు అందుకోనున్నారు. అభ్యర్థులను తీసుకెళ్లే బాధ్యతను జిల్లా విద్యాశాఖాధికారికి ప్రభుత్వం అప్పగించింది. ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు 24వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు వారికి కేటాయించిన వసతి కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. పురుష అభ్యర్థులకు ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, మహిళా అభ్యర్థులకు ఒంగోలులోని రామచంద్రమిషన్ ఆశ్రమం, సెయింట్ జేవియర్స్ అగ్జీలియం స్కూళ్లలో వసతి ఏర్పాటు చేశారు. వసతి కేంద్రాల్లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ఫారం పూర్తి చేశాక వారితోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి గుర్తింపు కార్డు జారీ చేస్తారు. రాత్రికి భోజనం, 25న ఉదయం అల్పాహారం వసతి కేంద్రంలోనే అందజేస్తారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో వారిని అమరావతికి తరలిస్తారు. మార్గమధ్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు 24న ఒంగోలు రావాలని విద్యాశాఖ అధికారులు ఫోన్లు చేసి సమాచారం అందిస్తున్నారు. అభ్యర్థులు తమతో వచ్చే కుటుంబ సభ్యుల ఒరిజినల్ ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, డీఎస్సీ హాల్ టికెట్, వసతి కేంద్రాల్లో రాత్రి బస చేసేందుకు వీలుగా దుప్పటి, దిండు, రెయిన్ కోట్/ గొడుగు తెచ్చుకోవాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- పుల్లారెడ్డిపాలెం వాసులుగా గుర్తింపు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో టంగుటూరు మండలానికి చెందిన ఇద్దరు మృతిచెందారు. మండలంలోని ఆలకూరపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లారెడ్డిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు వెంకటేశ్వర్లు (51), టంగుటూరు గ్రామ పంచాయతీలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన చొప్పర శ్రీను (40) టంగుటూరు వైపు నుంచి ఒంగోలుకు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నారు. వెనుక వస్తున్న లారీ తూర్పునాయుడుపాలెం ఫ్లైఓవర్ కిందకు దిగాల్సి ఉంది. ఈక్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో ముందున్న మోటార్‌సైకిల్‌ను లారీ ఢీకొట్టడంతో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురినీ నేషనల్ హైవే అంబులెన్స్‌లో ఒంగోలు ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. అక్కడ వారిరువురూ చికిత్స పొందుతూ మరణించారు.

సామాన్యులకు తీపి కబురు!

- తగ్గిన నిత్యావసర సరుకుల ధరలు
- దసరాకు ముందే వచ్చిన పండుగ సందడి
- జీఎస్‌టీ 2.0తో అన్ని వర్గాల్లో ఆనందం
- తొలిరోజే ఊపందుకున్న వ్యాపారాలు 7

నత్తనడకన సొసైటీల ఆడిట్

- ఇప్పటి వరకూ 8 సంఘాల్లోనే పూర్తి
- రాష్ట్రంలో జిల్లా 22వ స్థానం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (సొసైటీల్లో) 2024-25 ఆర్థిక సంవత్సర ఆడిట్ నత్తనడకన సాగుతోంది. మొత్తం 93 సొసైటీలు ఉండగా ఇప్పటివరకు కేవలం ఎనిమిదింటిలో మాత్రమే పూర్తయింది. ఆ ప్రకారం కేవలం 8.6శాతం సొసైటీలకు మాత్రమే ఆడిట్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. ఆ ప్రక్రియలో జిల్లా రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచింది. మరో నాలుగు సొసైటీల ఆడిట్ చివరి దశకు చేరింది. నిబంధనల ప్రకారం ఆడిట్ ప్రక్రియ సెప్టెంబరు ఆఖరుకు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఇంకా 75 సొసైటీల ఆడిట్ చేయాల్సి ఉంది.



కంప్యూటరీకరణలో జాప్యమే కారణం

జిల్లాలో సొసైటీల కంప్యూటరీకరణలో చోటుచేసుకున్న జాప్యమే ఆడిట్ ప్రక్రియ మందకొడిగా సాగడానికి కారణమైంది. నిబంధనల ప్రకారం సొసైటీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీల ఆడిట్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమై సెప్టెంబరు ఆఖరుకు పూర్తి కావాల్సి ఉంది. అయితే కంప్యూటరీకరణలో సమస్యలు ఉత్పన్నమవడం ఆడిట్‌కు ఆటంకంగా మారింది. కంకరెంట్, ఫైనల్ పేరుతో సొసైటీల్లో ప్రస్తుతం రెండు రకాల ఆడిట్‌ను నిర్వహిస్తున్నారు. గతంలో ఫైనల్ ఆడిట్ మాత్రమే చేసేవారు. అయితే సొసైటీ రోజువారీ లావాదేవీల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసేందుకు కంకరెంట్ ఆడిట్‌ను ప్రవేశపెట్టారు. ఆర్థిక సంవత్సరంలో రోజువారీ లావాదేవీలను కంకరెంట్ ఆడిట్‌లో పరిశీలిస్తే ఆర్థిక సంవత్సరం ముగిశాక లావాదేవీలన్నింటిపై ఫైనల్ ఆడిట్‌లో తేల్చి లాభనష్టాల నివేదికలు, ఆడిట్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. జిల్లాలోని ఎనిమిది సొసైటీల్లో ఆడిట్ పూర్తయింది. అందులో నందిపాడు, చీమకుర్తి, వల్లూరు, గుడిపూడివారిపాలెం, చినారికట్ల, విశ్వనాథపురం, కురిచేడు, దర్శి సొసైటీలు ఉన్నాయి. జిల్లాలోని అన్ని సొసైటీల ఆడిట్‌ను ఈనెలాఖరులోపు పూర్తి చేస్తామని డీసీఏవో డి.శ్రీనివాసరావు తెలిపారు. ఆ ప్రక్రియపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించామని ఆయన చెప్పారు.



కదం తొక్కిన విద్యుత్ ఉద్యోగులు

- చర్చి సెంటర్‌లో మానవహారం
- దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం

విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఆందోళనబాట పట్టారు. సమస్యల పరిష్కారం కోసం సమరశంఖం పూరించారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసనలకు దిగారు. సోమవారం ఒంగోలులో విద్యుత్తు భవన్ నుంచి ర్యాలీగా ప్రకాశం భవన్ వరకు వచ్చి మానవహారం చేపట్టారు. 7



బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో త్రిపురాంతకంలోని అమ్మవారు

బాలా త్రిపురసుందరీదేవీ నమోస్తుతే!

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన సోమవారం అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం పల్లకిసేవతో ఉత్సవాలు మొదలయ్యాయి. అమ్మవారికి అభిషేక కాలపూజ, బాలభోగం, గోపూజ తదనంతరం గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుత్వికరణం, చండీహోమం, ఉభయదాతలచే ఉత్సవమూర్తికి అభిషేక కార్యక్రమాలు జరిగాయి. అనంతరం బాలా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు పద్మవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి



మినీ మిర్చి యార్డును ఏర్పాటు చేయాలి

- అసెంబ్లీలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



మార్కాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మిర్చి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మార్కాపురంలో మినీ మిర్చి యార్డును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. డివిజన్‌లోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కందుల గళం విప్పారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం మార్కాపురం డివిజన్ అన్నారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలు ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలన్నారు. ముఖ్యంగా లక్ష ఎకరాల్లో మిర్చి పండించే ఈ ప్రాంత రైతులు సుమారు 300 కిలో మీటర్ల దూరం గుంటూరు వెళ్లి పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని కందుల అన్నారు. రవాణా ఖర్చులు ఇబ్బందికరంగా మారాయన్నారు. వర్షాధారంపై ఆధారపడి మిర్చి పండించే రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా ప్రభుత్వం మినీ యార్డుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలి

- అసెంబ్లీలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో గృహాలను అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. గిద్దలూరు పట్టణంలోని నంద్యాల రోడ్డులో 2014-19 కాలంలో 1,240 పైగా టిడ్కో గృహాలను మంజూరు చేసి 1,100 పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన 140 గృహాలకు అర్హులైన లబ్ధిదారులు రూ.లక్ష, రూ.50వేలను డీడీల రూపంలో కట్టి ఉన్నారని తెలిపారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అప్పటికే డీడీలు కట్టిన వారికి ఆ నగదు చెల్లించకుండానే గృహాలను రద్దు చేసిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వారికి నచ్చిన అనుకూలమైన వారికి కేటాయించిందన్నారు. దీనిపై విచారించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. గిద్దలూరు పట్టణ ప్రజలు కొన్ని సంవత్సరాలుగా రైల్వే గేటు సమస్యను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఓవర్ బ్రిడ్జిని నిర్మించి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కోరారు.



కారుమంచి మేజర్ కర్షకుల కడ'గండ్లు'

నాలుగేళ్ల క్రితం క్వారీ గుంతలోకి కుప్పకూలిన కెనాల్

పునరుద్ధరణను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ఎన్నికలనాటి హామీ అమలుకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కృషి

రూ.2.60కోట్లు డీఎంఎఫ్ నిధులు మంజూరు

టెండర్లు పిలిచే దశలో సీఈ అత్యుత్సాహంతో సీన్ రివర్స్

కట్ట కూలటానికి కారణమైన క్వారీ యాజమాన్యంతో ఆయన సంప్రదింపులు

ఈ పరిస్థితుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చిన ఇరిగేషన్ శాఖ రాష్ట్ర సెక్రటరీ

జలాశయాల్లో నిండుగా నీళ్లున్నా రైతులకు ఒనగూరని ప్రయోజనం

నేడు చలో కలెక్టరేట్‌కు పిలుపు

చీమకుర్తి,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఇరిగేషన్‌శాఖ జిల్లా అధికారులు, నాలుగు మండలాలలో ఉన్న అధికార పక్ష నాయకులు వీరందరి ఆశయాన్ని ఒక్క అధికారి నిర్వాహకం నీరుగార్చేలా చేసింది. రైతులతో పాటు వేలాది మంది ప్రజలకు గుక్కెడు తాగునీళ్లు ఇవ్వలేని పరిస్థితిని కల్పించింది. నాలుగు మండలాల పరిధిలో దాదాపు ఇరవై వేల ఎకరాల ఆయకట్టు, పద్దెనిమిది గ్రామాల ప్రజలకు తాగునీరు అందించే కారుమంచి మేజర్ కట్ట.. క్వారీయింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రానైట్ యాజమాన్యం నిర్వహించిన కార్యకలాపాలతో కూలిపోయింది. నాడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం మేజర్ పరిధిలో ఉన్న ప్రాంతం సింహభాగం తెలుగుదేశం వారే ఉన్నారన్న ఏకైక కారణంతో కాలువ పునరుద్ధరణను గాలికి వదిలేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించిన ప్రస్తుత ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రజల ఆవేదన గమనించి చలించిపోయారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే కారుమంచి కెనాల్ పునరుద్ధరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలవటంతో వెంటనే కారుమంచి కెనాల్ పునరుద్ధరణపై దృష్టి సారించారు.

కాలువ ఆయకట్టు గ్రామం కేవీపాలేనికి చెందిన ఎన్ఆర్ఐ నల్లూరి వెంకటశేషయ్య తన సొంత నిధులు దాదాపు రూ.25లక్షలను ఖర్చుపెట్టి కాలువకు తాత్కాలిక మరమ్మతులు చేసి 30 క్యూసెక్కులు నీరు వెళ్లేలా చేశారు. మేజర్ పరిధిలో ఉన్న బూసరపల్లి గ్రామానికి చెందిన మరో ఎన్ఆర్ఐ తక్కెళ్లపాటి రమేష్, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాలువను సందర్శించారు. కట్ట శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణకు డీఎంఎఫ్ నిధులను మంజూరు చేయాలని నాటి కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందచేశారు. స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో కలిసి కుప్పకూలిపోయిన కట్టను పరిశీలించారు. తక్షణమే కట్ట పునరుద్ధరణకు డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి రూ.2.60కోట్లు నిధుల అవసరమని నివేదికను అందచేశారు. ఈ నిధులు మంజూరుకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఫైల్‌ను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వద్దకు తీసుకెళ్లి రైతుల కష్టాను వివరించి ఆమోదింపచేశారు. ఇక టెండర్లు పిలవటమే తరువాయి అన్న తరుణంలో సీన్ రివర్స్ అయింది.

కథ నడిపిన సీఈ

నిధులు మంజూరు కావటంతో టెక్నికల్ అనుమతులు కోసం ఇరిగేషన్ శాఖాధికారులు సీఈకి నివేదించారు. వెంటనే ఆమోదం తెలపాల్సిన సదరు ఉన్నతాధికారి తీసుకున్న నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారింది. కట్ట కూలిపోవటానికి కారణమైన క్వారీ యాజమాన్యానికే ఆయన కట్ట పునరుద్ధరణపై అధికారికంగా లేఖ రాయటం సమస్యను తెచ్చిపెట్టుకున్నట్లయింది. 2023లో క్వారీ యాజమాన్యం అప్పటి ప్రభుత్వానికి ఓ వినతిపత్రం అందచేసింది. కట్ట కూలిన ప్రాంతాన్ని తమకు అప్పగిస్తే కాలువ వెళ్లే మార్గాన్ని మార్చి కొత్తగా కాలువను తమ ఖర్చులతో పునరుద్ధరిస్తామని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది. దీంతో క్వారీ యాజమాన్యం మౌనం దాల్చింది. ఇప్పటికే ఈ క్వారీలో అనుమతించిన దానికంటే ఎక్కువ లోతులో అదీ బఫర్ జోన్ నిబంధనలను ఉల్లంఘించి ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న భూమిలోకి వచ్చి మరీ క్వారీయింగ్ చేయటంతో కట్ట కూలిపోవటానికి ప్రధాన కారణమైందని అపుడు విచారణ జరిపిన అధికారులు నిగ్గు తేల్చారు. ఈ పరిస్థితుల్లో కట్ట కూలటానికి కారణమైన వారితో ఇరిగేషన్ ఉన్నతాధికారి సంప్రదింపులు జరపటం ఏమిటో అంతుచిక్కడంలేదు. సీఈ రాసిన ఉత్తరానికి క్వారీ యాజమాన్యం ఇచ్చిన సమాధానం మరింత విస్తుగొలిపేలా ఉంది. కాలువ ప్రవాహ మార్గాన్ని మార్చి నూతన మార్గానికి అవసరమైన భూమిని సేకరించి తమకు అప్పగించటంతో పాటు కూలిన ప్రాంతాన్ని తమకు ఇస్తే తామే కట్ట పునరుద్ధరిస్తామని తాపీగా సమాధానం ఇచ్చింది. కాలువ మార్గాన్ని మార్చటానికి ఎటువంటి అవకాశం లేని పరిస్థితి ఇక్కడ ఉంది. కాలువకు ఇరువైపులా గ్రానైట్ పరిశ్రమ విస్తరించి ఉంది. వారి భూముల నుంచి కాలువ వెళ్లటానికి ఒప్పుకొనే పరిస్థితి లేదు. ఇక్కడి పరిస్థితులను వాకబు చేయకుండా ఏకపక్షంగా క్వారీ యాజమాన్యం ప్రతిపాదించిన ప్రతిపాదనకు ఏకీభవించిన సదరు అధికారి దానిని రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారు. తదనుగుణంగా ఇరిగేషన్ సెక్రటరీ సీఈ ఇచ్చిన నివేదిక మేరకు తాము తిరిగి ఆదేశాలు ఇచ్చే వరకూ కట్ట పునరుద్ధరణపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఉత్తర్వులు జిల్లా అధికారులకు జారీచేశారు. దీంతో కారుమంచి కథకంచికి చేరింది. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కృషి, ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్, జిల్లా ఇరిగేషన్ అధికారుల సానుకూలతలు అన్నీ బుగ్గిపాలయ్యాయి.



క్వారీలో విరిగిపడిన కారుమంచి మేజర్ కాలువ

ఆయకట్టు రైతాంగం ఆక్రందన...

కారుమంచి మేజర్ పరిధిలో దాదాపు 20వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 18 గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాల్సి ఉంది. కెనాల్ కుప్పకూలక ముందు కాలువ ద్వారా రామతీర్థం జలాశయం నుంచి 130 క్యూసెక్కులు సరఫరా అవుతాయి. ఎటువంటి ఇబ్బంది లేకుండా పంటలు పండించుకొనేవారు. కాలువ కూలిన తర్వాత తాత్కాలికంగా కాలువను బైపాస్ చేసి పట్టలు కప్పి 30 క్యూసెక్కుల మేర నీటిని ఎంతో కొంత ఉపశమనం కల్గించేలా అప్పటినుంచి సరఫరా చేస్తున్నారు. దీనివలన పంటలకు సరిపడా నీరందక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుతం జలాశయాలు నిండుగా ఉన్నా కారుమంచి మేజర్ రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.

ఉద్యమానికి సిద్ధమైన రైతులు

తమ కష్టాలు గట్టెక్కుతున్నాయి.. కారుమంచి మేజర్ పునరుద్ధరణ పనులు ప్రారంభం కాబోతున్నాయి అని ఆశగా ఎదురు చూస్తున్న రైతులకు పనులు ప్రారంభయ్యే అవకాశం లేదన్న వార్త తెలిసి రగిలిపోతున్నారు. ఐక్య కార్యాచరణ ఉద్యమానికి రంగం సిద్ధం చేశారు. దీనిలో భాగంగా మంగళవారం ఆయకట్టు రైతులు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తదుపరి ఉన్నతాధికారుల నుంచి స్పందన రాకపోతే చలో అసెంబ్లీ నిర్వహించి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇరిగేషన్ మంత్రి రామానాయడుని ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో కలిసి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకోవాలని యోచిస్తున్నారు.



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఎన్ఆర్ఐలు నల్లూరి వెంకట శేషయ్య, తక్కెళ్లపాటి రమేష్

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

అవీఇవీ



ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద కోరారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వీఆర్ఏలకు పేస్కేలును అమలు చేయడంతోపాటు నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులైన వారందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాల వంటి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా సంఘం నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆయా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొండలరావు, వేణు, నరసింహారావు, సామేలు, పవన్, శ్రావణి, శారద, సుజాత తదితరులు ఉన్నారు.

ఆక్వా సాగు చేసే ప్రతి రైతూ లైసెన్స్ తీసుకోవాలి

చినగంజాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఆక్వా సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని కారంచేడు మత్స్యశాఖభివృద్ధి అధికారి ఎం.రవీంద్ర సోమవారం తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఆక్వాసాగు, ఆక్వా బిజినెస్ ఆపరేషన్స్ చేపల, రొయ్యల చెరువులను క్రమబద్ధీకరణ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్-2020ను తీసుకొని వచ్చిందన్నారు. ఈ యాక్ట్ కింద చెరువులను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఇప్పటి వరకు లైసెన్స్ లేకపోవడం, లైసెన్స్ ఉండి రెన్యువల్ చేయలేకపోతే రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్-2020, కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. ఆక్వా రైతులు లైసెన్స్ లేని వారు, రెన్యువల్ చేయని వారందరూ ఆయా గ్రామాల మత్స్య సహాయ కులను సంప్రదించాలన్నారు. పెదగంజాం గ్రామమత్స్య సహాయకులు ఎస్‌కే.కాలేషా సెల్ నెంబరు.9494630542, మోటుపల్లి గ్రామానికి డి.రామారావు సెల్ నెంబరు.6281738228, చినగంజాం, కొత్తపాలెం గ్రామాలకు సీ.హెచ్.డార్విన్ సెల్ నెంబరు 9441996257, ముస్నం వారిపాలెం, రాజుబంగారుపాలెం గ్రామాలకు పి.సుబ్రహ్మణ్యం సెల్ నెంబరు 9963228864లను సంప్రదించాలని రవీంద్ర తెలిపారు.

నిషేధిత జాబితా నుంచి విముక్తి

అద్దంకి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):అద్దంకిపట్టణంలోని ఉత్తర అద్దంకి 1038 సర్వే నంబరులో దేవాలయాల స్థలాలు పోను మిగిలిన భూమిని సబ్‌డివిజన్ చేసి నిషేదిత జాబితా నుండి తొలగించినట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. ఆరు దేవాలయాలకు సంబంధించిన స్థలాలను సబ్ డివిజన్ చేసి మిగిలిన విస్తీర్ణంలో క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్‌కు వీలు కల్పిస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు పంపినట్లు తెలిపారు. కొంతకాలంగా నిలిచిపోయిన క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లకు అడ్డంకులు తొలగిపోయాయి.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

చినగంజాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 24వ తేదీ నుండి అక్టోబరు 2వ తేది వరకు కడవకుదురు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో సీజన్-2 రెడ్ టెన్నిస్ బాల్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టోర్నమెంట్‌లో విజేతలైన టీంకు మొదటి బహుమతి రూ.25,000లు, రెండవ బహుమతి రూ.20,000లు, మూడవ బహుమతి రూ.15,000లు, నాలుగవ బహుమతి రూ.10,000లు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు శ్యామ్ సెల్ నెంబరు 8688369827, హర్ష సెల్ నెంబరు 9390012789లను సంప్రదించాలన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

సంతమాగులూరు, సెప్టెంబర్ 22, (ఆంధ్రజ్యోతి) మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీలోని రామిరెడ్డిపాలెంలో 8వ రాష్ట్రీయ పోషణ వార్షికోత్సవం సీడీపీవో సుధారాణి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ జి.ప్రమీల అధ్యక్షతన నిర్వహించారు. పోషణ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం బొమ్మల కొలువులో భాగంగా పేరెంట్స్ ను ఆహ్వానించి, వర్ణమాల బొమ్మల కొలువులు "అ నుండి అః వరకు" ప్రతి అక్షరానికి సంబంధించిన చిత్రాలను చూపించారు. వాళ్ల పిల్లల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తిరుమల, ఇందిరా, చిన్నమ్మ, దుర్గ, బసవమ్మ, బోడెమ్మ పద్మ, షకీరా, అపర్ణ, మస్తానమ్మ, మస్తాన్‌బీ, తల్లులుపిల్లలు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ పిలుపుమేరకు సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో కాంగ్రెస్ నాయకులు

పర్చూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో జరుగుతున్న ఓట్ల చోరీ జరుగుతోందని, కేంద్ర ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పర్చూరులో సంతకాల సేకరణ నిర్వహించారు.ఈసందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లగొర్ల శివలక్ష్మీజ్యోతి ఆధ్వర్యంలో రోటరీ భవనంలో 'ఓట్ చోర్ గద్దె చోడ్' కార్యక్రమంలో భాగంగా సంతకాలు సేకరించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి మాట్లాడుతు రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రధాన న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

ఒంగోలు(రూరల్)సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయస్థాన కార్యాలయంలో సోమవారం జిల్లా న్యాయాధికారి ఎ.భారతిని ఎస్పీ హర్షవర్ధన్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. న్యాయ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా కృషిచేయటంపై వారు చర్చించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

● పర్చూరు సెంటర్‌లో తక్కువ ధరకు ఉల్లిపాయల విక్రయం

పర్చూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. సోమవారం ఏఎంసీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉల్లి రైతులకు సరైన మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిన ఉల్లిపాయలను కేజీ రూ. 11 చొప్పున స్థానిక బొమ్మల సెంటర్‌లో ఏఎంసీ చైర్మన్ పంపిణీ చేశారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

(5వపేజీ తరువాయి)

అధికారులకు సూచించారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను ఈపీటీఎస్ వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేశు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, వరకుమార్, పార్థసారథి, జాన్సన్, విజయ జ్యోతితోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజాబాబు ముందుగా అర్జీదారులు రిజిస్ట్రేషన్ చేసుకునే కౌంటర్ వద్ద టోకెన్ తీసుకునే విధానాన్ని పరిశీలించారు. దాని గురించి డీఆర్వో ఓబులేశు కలెక్టర్‌కు వివరించారు.

తాగునీటికి తొలివిడత ప్రాధాన్యం ఇవ్వాలి

కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగునీటి కోసం ప్రజలు ఎవరూ ఇబ్బందులు పడకుండా తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశించారు. ఆ దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరుల శాఖ, డ్వామా, పంచాయతీ, జిల్లాపరిషత్, ఇరిగేషన్, విద్యుత్‌శాఖల అధికారులతో సోమవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో సమీక్షించారు. జిల్లాలో తాగునీటి వనరులు, ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పైపులైన్లు, ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా తాగునీటి ట్యాంకర్లను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. భూగర్భ నీటి మట్టం, వాటిని పెంచేందుకు చేపట్టిన చర్యలను ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వందనం వివరించారు. ఆయాశాఖల ద్వారా నీటి సంరక్షణ కోసం చర్యలను వివరించారు. ఆయా అంశాలపై స్పందిస్తూ కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ తాగునీటి కోసం ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి రాకుండా చూసుకోవాలని చెప్పారు. ట్యాంకర్ల సరఫరాలో ఎస్సీ, ఎస్టీకాలనీల పట్లపక్షపాతం ఉండకూడదన్నారు. బోర్లు వేసే విషయంలో భూగర్భ నీటి వనరుల శాఖ గుర్తించిన జియో కోఆర్డినేట్లతో సమన్వయం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంచినీటి పథకాల రిపేర్లు, ఇతర ఖర్చులకు నిధులు మంజూరు చేయిస్తానని కలెక్టర్ తెలిపారు. చెరువుల్లో పూడికతీతపైనా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వివిధ అంశాలకు సంబంధించి తాత్కాలిక ప్రాతిపదికన కాకుండా శాశ్వత ప్రాతిపదికన 24 గంటలు పనిచేసేలా కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో చిన ఒబులేషు, వివిధ శాఖల అధికారులు వరలక్ష్మీ, కట్టా వెంకటేశ్వర్లు, ఎం. వెంకటేశ్వర రావు, చిరంజీవి ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

స్మార్టుకార్డులతో బహుళ ప్రయోజనాలు

● మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌కార్డులతో లబ్ధిదారులకు బహుళ ప్రయోజనాలున్నాయని, సాంఘి క సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం అద్దంకిలో పలువురు లబ్ధిదారులకు కార్డులను అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి రేషన్ కార్డులపై కూడా తన ఫొటో ముద్రించుకున్నాడన్నారు. ప్రస్తుతం స్మార్ట్‌కార్డుల ద్వారా మెరుగైన సేవలు ప్రజ లకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో రోడ్డు ప్రమాదాల జరగకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ ఉదయం, సాయంత్రం సమయంలో నామ్ రోడ్డు లో ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను ఉంచాలన్నారు. త్వరలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడతా మన్నారు. దీని ద్వారా కొంత మేర ట్రాఫిక్ మరల్చ వచ్చన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న పాత భవనాలను వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ రవీంద్రకు మంత్రి రవికుమార్ సూచించారు. పలువురి నుంచి వచ్చిన అర్జీలను తీసుకున్నారు. కార్యక్రమాలలో తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఆర్ఐ శంకర్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సుభాషిణి లహరి, అత్తులూరి రమేష్ పాల్గొన్నారు.

● సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదు

అద్దంకి: వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సచివా లయ ఉద్యోగులకు తక్కువ జీతాలు ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జీతాలు పెంచిం దని సాంఘిక సంక్షేమ శాఖ మం త్రి డీబీవీ స్వామి అన్నారు. అద్దంకిలో పలు కార్య క్రమాలకు హాజరయ్యేందుకు వచ్చిన మంత్రులు స్వామి, రవికుమార్లకు వేర్వేరుగా సచివాలయ ఉద్యో గులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భం గా పనిభారం తగ్గించాలని, ఇంటింటి సర్వేలు లేకుండా చేయాలని సచివాలయ ఉద్యోగులు మంత్రి స్వామిని కోరగా స్పందించిన మంత్రి ఇంటింటి సర్వే సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. గతంలో ఒక పంచాయతీ కార్యదర్శి చేసే పనికి ప్రస్తుతం 8 మంది సచివాలయ సిబ్బంది పనిచేస్తున్నందున పని విభజన చేసుకొని ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు చేరే విధంగా చూడాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు.



స్మార్ట్‌కార్డులను అందజేస్తున్న మంత్రి రవికుమార్

మురుగునీరు ముందుకెళ్లేలా కాలువ తవ్వకం

బల్లికురవ, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం బల్లికురవలో చిన్నపాటి వర్షం కురిసినా, వర్షపు నీరు పల్లంలో ఉన్న తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలోని పెద్దఎత్తున చేరుతోంది. కార్యాయాల ముందు ఉన్న మురుగు కాలు వలో మురుగు పేరుకపోయింది. దీంతో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో కార్యాలయాలలోకి నీరు వెళ్లింది. తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారిలు కార్యాలయం లోని నీరు బయటకు వచ్చేలా కాలువ తవ్వించారు. రోడ్డు అంచులోని చిరు దుకాణాల వారిని వెంటనే ఖాళీ చేయించి కాలువ పనులు చేయిస్తున్నారు. గతంలో ఉన్న కాలువను పైపులను తీయించి మురుగు నీరు వాగులోకి వెళ్లేలా పనులు చేయిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలువ పనులు చేయిస్తున్నామని అధికారులు తెలిపారు. రోడ్డు వెంబడి దుకాణాలు నిర్వహించుకొనే వారు కాలువలను పూడిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



మురుగునీరు బయటకు వెళ్లేలా కాలువ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

రోడ్డు అంచులు లేకపోవడంతో పొంచి ఉన్న ప్రమాదం

మేదరమెట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కొరిశపాడులో సిమెంట్ రోడ్డుకు అంచులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి రావినూతల వరకు రహదారులు భవనాల శాఖ అధ్వర్యంలో రోడ్లు నిర్మించారు. హైవే నుంచి కొరిశపాడు చెరువు వరకు సిమెంట్ రోడ్డు నిర్మించారు. సిమెంట్ రోడ్డు నిర్మిణ సమయంలో రోడ్డు అంచులు సక్రమంగా నిర్మించలేదు. దీంతో సిమెంట్ రోడ్డుకు ఉత్తరం వైపున పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. కొత్త వ్యక్తులు ఎవరైనా ఈ రోడ్డు వెంబడి ప్రయాణం చేసేటప్పుడు అంచులు అర్థంకాక ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. ఒకసారి కట్టెల ట్రాక్టర్ బోల్తాపడడంతో ఒకరు మృతిచెందగా, పలువురు గాయ పడ్డారు. ఇదే దారిలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు మండల కార్యాలయానికి, ప్రాథమిక ఆ రోగ్య కేంద్రానికి , పశువుల ఆస్పత్రికి వచ్చే ప్రజలు ఎదురు వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బంది పడుతు న్నారు. కొరిశపాడు నుండి కుర్రావానిపాలెం మీదగా రావి నూతల వెళ్లే వారు కూడా ఈ రోడ్డునే ప్రయాణిస్తుంటారు. రహదారులు భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి సిమెంట్ రోడ్డుకు రెండు వైపులా గ్రావెల్‌తో అంచులను వేయాలని కొరిశపాడు గ్రామస్థులతో పాటు మండల ప్రజలు కోరుతున్నారు.



అంచులేని సిమెంట్ రోడ్డు


'గుండ్లకమ్మ' 10 గేట్లు ఎత్తివేత

మద్దిపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి సోమవారం 25 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. 10 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కారణంగా ప్రాజెక్టులోకి నీరు చేరుతోంది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లు పంపుతున్నామని, వరద ఉధృతి పెరిగితే మరో గేటు ఎత్తే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు



సామాన్యులకు శుభవార్త!



తగ్గిన నిత్యవసర ధరలు, దసరాకు ముందే వచ్చిన పండుగ సందడి

జీఎస్టీ 2.0తో అన్ని వర్గాల్లో ఆనందం

తొలిరోజే ఊపందుకున్న వ్యాపారాలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా దసరా సందడి మొదలైంది. పండుగ ఆనందంలో ఉన్న సామాన్యులకు కేంద్రం శుభవార్త చెప్పింది. పలు నిత్యవసరాలపై జీఎస్టీని తగ్గించడంతో అన్ని వర్గాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. సోమవారం నుంచి ధరలు తగ్గడంతో నిత్యవసర సరుకులతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు వ్యాపారాలు ఊపందుకోనున్నాయి. దీంతో దసరా, దీపావళికి డబుల్ ధమాకా పండుగ ప్రజల్లో కనిపిస్తుంది.

ముందే వచ్చిన దసరా..దీపావళి

నిన్న మొన్నటి వరకు ఏ వస్తువు కొనాలన్నా జీఎస్టీ పేరుతో బాధేస్తుండటంతో అన్నీ వర్గాల ప్రజలు బెంబేలెత్తారు. ప్రతి ఇంటిలో తప్పనిసరి అయిన ఉప్పు, పప్పు, ఇతర నిత్యవసర ధరలు సామాన్యుడి జేబులు చిల్లుపడే పరిస్థితి ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ 2.0 సంస్కరణలను అమలు చేయడంతో ధరల పెరుగుదలతో సతమతమవుతున్న ప్రజలకు నూతన సంస్కరణలు మరింత ఊరటనిస్తుండగా, దీంతో దసరా, దీపావళి ముందే వచ్చినట్టు కనిపిస్తుంది.

ధరలు తగ్గిన వస్తువులివే

కొత్త జీఎస్టీ రేట్లతో వస్తువులు ఈ విధంగా తగ్గనున్నాయి. సబ్బులు, టూత్ పేస్టులు, పాలు, డెయిరీ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మెడికల్స్, ఆటోమొబైల్స్ వాషింగ్ పౌడర్లపై జీఎస్టీ తగ్గగా, చిన్న కార్లపై కొంత తగ్గించినా, ఎలక్ట్రానిక్ వాహనాలపై మరింత పన్ను రాయితీ లభిస్తుంది. ఇక పోతే పిల్లల వస్తువులు, స్కూల్ బ్యాగ్స్, గృహోపకరణాలపై వంటి వాటిపై పన్ను తగ్గింది. ఉదాహరణకు ప్రతి ఇంట్లో ఉపయోగించే 18 శాతం ఉండగా, ప్రస్తుతం 12 శాతానికి తగ్గింది. దీంతో రూ. 50 విలువైన వస్తువుపై రూ.3లకు తగ్గింది. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువు ఫ్రిజ్‌పై 18 శాతం ఉన్న జీఎస్టీ 12 శాతానికి తగ్గించారు. దీంతో రూ. 20వేలు ఉన్న ఫ్రిజ్‌పై రూ. 1200 వరకు తగ్గింది. అలాగే మైక్రోఓవెన్‌లపై 18 శాతం ఉన్న జీఎస్టీ ఉంటే 12 శాతం తగ్గగా, రూ.10వేలు ధరపై రూ.600 తగ్గింది. రూ.15వేలు విలువ కలిగిన వాషింగ్ మెషిన్‌పై రూ.900 తగ్గింది. ఏసీలపై ఇంతకముందు ఉండే ధర కంటే రూ.3వేల నుంచి రూ. 5వేలు తగ్గనుంది.

● పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట

ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు వస్తు సేవల ధరలు మరింత అందుబాటులోకి వచ్చాయి. నాలుగు శ్లాబ్‌లుగా అమలయ్యే జీఎస్టీ పన్ను ఇక నుంచి రెండు శ్లాబ్‌లుగా 5 శాతం, 18 శాతం వసూలు చేయనున్నారు. దీంతో సోమవారం నుంచి మార్కెట్ కళకళలాడనున్నాయి. వివిధ వస్తువులపై జీఎస్టీ తగ్గడం, మరికొన్నింటిపై తొలగించడంతో వ్యాపార వర్గాలోనూ, కొనుగోలుదారుల్లోనూ జోష్ కనిపిస్తుంది.

ఆహార పదార్థాలపై జీఎస్టీ తగ్గింపు ఇలా...

వస్తువు పేరు	పాతది	కొత్తది
అల్ట్రా హై టెంపరేచర్ పాలుపై	5	0
ఇండియన్ బ్రెడ్‌లు చపాతీ, పరోటా	5	0
పన్నీర్/ప్రీ ప్యాక్‌డు, లేబుల్ ఉత్పత్తులు	12	0
బటర్, చీజ్ డెయిరీ ఉత్పత్తులు	12	5
ఫ్లేవర్ మిల్క్	12	5
ఐస్ క్రీమ్స్	18	5
బిస్కట్స్, కుకీస్, కేక్స్	18	5
ఫ్రూట్ జ్యూస్	12	5
బ్రేక్‌ఫాస్ట్ కేరల్స్	18	5
ఇన్‌స్టంట్ కాఫీ, హెల్త్ మిక్స్‌స్	18	5
బేబీ ఫుడ్స్	18	5
కాన్‌ఫెక్షనరీ, చాక్లెట్స్‌లు, క్యాండీస్	12, 18	5
స్నాక్స్	12, 18	5
బేబీ హైజన్/డైపర్స్/వైప్స్	18	5
నిత్యవసర వస్తువులు		
షాంపూలు, హెయిర్ ఆయిల్స్	12, 18	5
టూత్ పేస్ట్, టూత్ బ్రష్‌లు	18	5
టాయిలెట్ సోప్‌లు, బార్స్	18	5
టాల్కమ్ పౌడరు	18	5
షేవింగ్ క్రీమ్, లోషన్	18	5
స్టేషనరీ, నోట్ బుక్స్, పెన్సిల్స్	12	0
టాయ్స్	12	5
గోధుమ పిండి, ఆటా, మైదా	5	0
వెన్న, నెయ్యి, తదితర పాల ఉత్పత్తులు	12	5
ఇతరాలు		
మొబైల్ ఫోన్‌లు	28	18
వంట సామగ్రి	12	5
ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, ఏసీ	28	18
సిగిరెట్‌లు, కూల్ డ్రింక్స్	18, 20	40
కేస్ క్లబ్‌లు, కేసినో సేవలు	18,20	40
వ్యవసాయ యంత్రాలు, డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు	12	5
దుస్తులు, ఫ్యాబ్రిక్స్, ప్యాచ్ వస్తువులు	12	5

పృథులగిరికి దసరా బ్రహ్మోత్సవాల శోభ



లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మర్రిపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి దసరా బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ముందుగా స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయంలో ఉన్న ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామిని మేళతాళాలతో పృథులగిరిపైకి తోడ్కొని వెళ్లారు. చిమట, కాకర్ల గ్రామాలకు చెందిన పొతకమూరి వంశస్థులు ఏటా దసరా నవరాత్రి ఉత్సవాలకు ఉభయ కర్తలుగా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో ఆలయప్రధానార్చకులు నారాయణం మారుతీఆచార్యులు, పరాంకుశం సాయిఆచార్యులు, ఉభయదాతలు, సిబ్బంది సుబ్బారావు పాల్గొన్నారు.

పొగాకు మొత్తాన్ని కొనేందుకు కృషి చేస్తా

బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



మాట్లాడుతున్న పొగాకు బోర్డ్ చైర్మన్ యశ్వంత్‌కుమార్

పొదిలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రస్తుతం పొగాకు ధరల్లో ఎదుర్కొంటున్న ఒడిదొడుకుల దృష్ట్యా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి అన్ని రకాల (ఎఫ్‌సీవీ) పొగాకు కొనుగోలు చేసేలా కృషి చేస్తామని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ చెప్పారు. సోమవారం పొదిలి పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. రైతులు రాబోయే పంట కాలనికి బోర్డు నిబంధనలు పాటించి, అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలని చెప్పారు. యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడి సాధించాలన్నారు. పరిమితికి మించి సాగు చేసి నష్టపోవద్దని రైతులకు సూచించారు. మార్కెట్ ధరలను చూసి అధిక మొత్తాలకు బ్యారన్‌లు, పొలాలను కౌలుకు తీసుకోవద్దని తెలిపారు. అనంతరం రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్, రైతు సంఘ నాయకులు తండే వీరనారాయణ, రేగుల వీరాంజనేయులు, బీరం కృష్ణారెడ్డి, బీరం నర్సారెడ్డి, చుండూరి ఆదినారాయణ పాల్గొన్నారు.

చట్టపరిధిలో సత్వర న్యాయం అందిస్తాం

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుల పట్ల సకాలంలో స్పందించి సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు చెప్పారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి 116 అర్జీలను స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం అందించి భరోసా కల్పించాలని పోలీసు అధికార్లకు సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రానికి రాలేని ఫిర్యాదిదారులు దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌లో లేక సర్కిల్ కార్యాలయంలో అందజేసినా మీకోసం అర్జీల కింద స్వీకరిస్తామని చెప్పారు. ప్రత్యేకించి మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు అర్జీలకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా బాధితులు సమస్యల పట్ల స్పందించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సుధాకర్, దుర్గాప్రసాద్, పాండురంగారావు, నాగరాజు, రామారావు, ఖాజావలి, రామకోటయ్య, ఎస్పీ జనార్దనరావు సిబ్బంది ఉన్నారు.

చికెన్ కూర వండలేదని ఆత్మహత్య



మృతుడు లక్ష్మీనారాయణ

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నచ్చిన కూర భార్య వండలేదని మనస్తాపం చెంది భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని గోళ్లవిడిపి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఇళ్ల లక్ష్మీనారాయణ (25) భార్యతో తరచూ గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం చికెన్ కూర వండాలని చెప్పడంతో భార్య వినకపోవడంతో మనస్తాపానికి గురై పొలాల్లోకి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. లక్ష్మీనారాయణ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బాలిక ఆత్మహత్య

బావి నుంచి నీరు తెచ్చే విషయమై ఘర్షణ



అరుణబాయ్(ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అక్కా, తమ్ముడు మధ్య ఏర్పడిన గొడవతో మనస్తాపానికి గురైన బాలిక పురుగుమందు తాగి ఆత్మాహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం మండలంలోని పాలుట్ల గూడెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన బాలునాయక్, మంగిబాయికి ఆరుగురు సంతానం. వారిలో మూడో అమ్మాయి, చివరి అబ్బాయి(తమ్ముడు) మధ్య బావి నుంచి నీరు తీసుకొచ్చే విషయమై ఘర్షణ నెలకొంది. దీంతో అరుణబాయి (16) పొలానికి వెళ్లి పురుగుమందు తాగి ఆత్మాహత్య చేసుకుంది. సమీపంలో ఉన్న తల్లి, కుటుంబ సభ్యులు గమనించి ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. తల్లి మంగిబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై చౌడయ్య కేసు నమోదు చేశారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాసుల (ఫైల్)


కొనకనమిట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్లగట్టు గ్రామంలో టిప్పర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొదిలి వైపు నుంచి కంభం వైపు వెళ్తున్న టిప్పర్ గొట్లగట్టు గ్రామం వద్దకు వచ్చేసరికి.. ఇంటి నుంచి బయలుదేరిన పొదిలి శ్రీనివాసులు(30) బైకుకు తగిలింది. దీంతో అతను కింద పడగా తలపై నుంచి టిప్పర్ వెళ్లడంతో మృతిచెందాడు. ఎస్ఐ వేమన ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తెలుగు మహిళలపై బనాయించిన కేసు కొట్టివేత

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తెలుగు మహిళ నాయకురాళ్లపై అక్రమంగా బనాయించిన కేసును న్యాయాధికారి కొట్టివేసినట్లు తెలుగు మహిళ అధ్యక్షురాలు నిడమానూరి పావని తెలిపారు. 2022 మే 2న ఒంగోలులో శాంతియుతంగా నిరసన తెలిపిన టీడీపీ మహిళ నాయకురాళ్లపై ఎస్సీ ఎస్టీ కేసు బనాయించారని తెలిపారు. అప్పట్లో యువతిపై అత్యాచారం జరిగితే అమెను పరామర్శించేందుకు వచ్చిన మంత్రుల కాన్వాయ్‌కి అడ్డు తగిలారని మహిళా నాయకురాళ్లపై ఒంగోలు వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో అక్రమ కేసు నమోదు చేశారని చెప్పారు. అప్పటి నుంచి తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ న్యాయవాది రాయిపాటి రవీంద్రనాథ్, పంగులూరి గోవిందయ్య కోర్టులో తమ వాదనలు వినిపించారు. మహిళలపై అక్రమంగా బనాయించినట్లు సాక్ష్యాధారాలు చూపించి కేసును కొట్టివేయించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిద్రమత్తులో బ్యారన్‌ను ఢీకొట్టిన లారీ

డ్రైవర్, క్లీనర్‌కు తీవ్రగాయాలు



బ్యారన్‌ను ఢీకొట్టిన లారీ

కంభం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ నిద్రమత్తుతో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొగాకు బ్యారన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన కంభం మండలం జంగంగుంట్ల గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరులో టమాటాలను దిగుమతి చేసుకుని తిరిగి సొంతూరు వెళుతున్న లారీ సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో కంభం మండలం జంగంగుంట్ల గ్రామ సమీపంలోకి రాగానే డ్రైవర్ మహేంద్ర నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో రోడ్డు పక్కన ఉన్న పొగాకు బ్యారన్‌ను బలంగా ఢీకొట్టగా డ్రైవర్ మహేంద్ర, క్లీనర్ బాలు లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో వచ్చి క్యాబిన్‌లో ఇరుక్కున్న వారిని స్థానికుల సహాయంతో సుమారు రెండుగంటలపాటు శ్రమించి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇరువురిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సహకార సొసైటీ పరిపుష్టికి సహకరించాలి

పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య



చైర్మన్లు, డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డాక్టర్ సీతారామయ్య, ఎరిక్షన్

పెద్దారవీడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సహకార సొసైటీ పరిపుష్టికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య చెప్పారు. మండల కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం మండలంలోని పెద్దారవీడు, చట్లమిట్ల సహకార సొసైటీల నూతన చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన జరిగింది. తొలుత పెద్దారవీడు, చట్లమిట్ల చైర్మన్లు చింతగుంట రాజేశ్వరరెడ్డి, వెన్నా బోడిరెడ్డి, డైరెక్టర్లతో టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ఆర్థికపరమైన సేవలందించడంలో ప్రకాశం జిల్లా కేంద్ర బ్యాంక్ రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. రూ.3,500కోట్ల మేర వ్యాపార లావాదేవీలను చేస్తోందని చెప్పారు. అందులో రూ.2,500కోట్ల రుణాలను అందిస్తుందన్నారు. గతంలోఒక రైతు గరిష్టంగా రూ.20లక్షల మేర మాత్రమే లబ్ధి చేకూరేదని, కానీ ఇప్పుడు రూ.30లక్షల వరకూ రుణాలు పొందేందుకు వీలు కల్పిస్తామని చెప్పారు. సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయిలో బ్యాంకుల సేవలు ప్రజలకు అందడం లేదని, త్వరలో సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు తప్పక లభిస్తాయని, వారు పొందిన పదవులకు తప్పక న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలో సింగిల్ విండో విధానం ప్రవేశపెట్టింది ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో రోడ్డు రవాణా కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా శ్రీను, మార్కాపురం, ఎర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్లు మాలపాటి వెంకటరెడ్డి, చేకూరి సుబ్బారావు, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ మండలాధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కడియం రామయ్య పాల్గొన్నారు.

కదం తొక్కిన విద్యుత్ ఉద్యోగులు

చర్చి సెంటర్‌లో మానవహారం

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాడి వారం రోజులుగా వివిధ రూపాలలో నిరసన తెలిపారు. అంతేకాకుండా విద్యుత్తు భవన్‌లో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రిలేదీక్షలు చేపట్టారు. సోమవారం జిల్లాలో ఉన్న ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో విద్యుత్తు భవన్ నుంచి ర్యాలీగా ప్రకాశం భవన్ వరకు వచ్చి మానవహారంగా ఏర్పడారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ హరిక్రిష్ణ మాట్లాడుతూ విద్యుత్తు శాఖలో ఏళ్ల తరబడి అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని అందుకే ఉద్యమబాట పట్టాల్సి వచ్చిందని చెప్పారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులందరికీ వైద్యసౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు.

అలాగే ఒకే పనికి ఒకే వేతనం విధానం అమలుల చేయలని కోరారు. ఏపీసీపీడీసీఎల్ జేఏసీ చైర్మన్ రాచగర్ల సంజీవరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. మరణించిన కార్మికుల కుటుంబాలలో రెగ్యులర్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిస్కారం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తేళ్ల అంజయ్య, విద్యుత్తు జేఏసీ కన్వీనర్ బీ సురేష్, జిల్లా కన్వీనర్ కేవీ రవి, ఆనందరావు, తేళ్ల జాన్సన్, చంద్రశేఖర్, బాలజీ పాల్గొన్నారు.

విద్యార్థులూ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్ మహమ్మారి ఉచ్చులో పడి విద్యార్థులు బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు అన్నారు. జార్జి ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం యాంటీ ర్యాగింగ్ కన్వెన్షన్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్న విషయం ఎప్పటికీ మరువద్దన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ పి.సుబ్బారావు, రూరల్ ఎస్సై అంకమ్మరావు, ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి మహిళ మృతి





మృతి చెందిన ఖాశింబి, రసూల్‌ను 108లో వైద్యశాలకు తరలిస్తున్న సిబ్బంది

పొన్నలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకుపాలెం సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో షేక్ ఖాశింబి(53) మృతి చెందింది. కనిగిరిలోని టకారిపాలేనికి చెందిన ఖాశింబి తన కుమారుడు నాయబ్ రసూల్‌తో కలిసి ఓ ఫంక్షన్ కోసం కందుకూరు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. వెంకుపాలెం సమీపంలో బైకు అదుపుతప్పి కిందపడగా, ఖాశింబికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన రసూల్‌ను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


జీఎస్టీ తగ్గించడంతో టపాసులు పేల్చి సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు

జీఎస్టీ తగ్గింపుతో బీజేపీ సంబరాలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు సోమవారం నుంచి అమలులోకి రావడంతో భారతీయ జనతా పార్టీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీయోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ కాంప్లెక్స్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ సోమవారం నుంచి అమలులోకి వచ్చిన వస్తు సేవల పన్ను-2 వల్ల అనేక వస్తువుల ధరలు తగ్గాయన్నారు. 395 రకాల వస్తువుల ధరలు భారీగా తగ్గించడం వల్ల మధ్యతరగతి ప్రజలు, వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, నాయకులు మాకినేని నరసింహం, సీతారామయ్య, బి. విజయారావు, శ్రీలక్ష్మి, జిల్లెళ్ళమూడి రమాదేవి, రాజేష్ వర్మ, మోజేష్, రాధాకృష్ణ, సత్యనారాయణ, గుర్రం రంగనాథ్, కొమ్ము శ్రీనివాసరావు, రవీంద్ర తదితరులు ఉన్నారు.

నూతన కమిటీకి అభినందనలు


నూతన కమిటీని అభినందిస్తున్న ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వాణిజ్యపన్నుల శాఖ (ది కమర్షియల్ టాక్సెస్) నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన వెంకటేష్‌బాబు, జిల్లాకు చెందిన కొప్పోలు సుధాకర్‌రావులను ఏపీఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపాటి విద్యాసాగర్ అభినందించారు. ఏపీఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, డీవీ రమణల ఆధ్వర్యంలో జరిగిన ఈ కమిటీ ఎన్నికల్లో రాష్ట్ర కమిటీలో 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జరిగిన అభినందన కార్యక్రమంలో రాష్ట్ర సంఘం నేతలతో పాటు జిల్లా నాయకులు, ఉద్యోగులు అభిమానులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సుధాకరరావును పూలమాలలతో అభినందించారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు యవ్వన దశలో సంక్రమించే వ్యాధులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఒంగోలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. కళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ కే ప్రతాప్, వి. శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

దళితసేవా ఫౌండేషన్ జిల్లా కార్యవర్గం

చీమకుర్తి,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): దళిత సేవా ఫౌండేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక సోమవారం మండలంలోని మర్రిచెట్లపాలెం గ్రామంలో జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతలపాలెం యలమందబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడిగా కలుజువ్వలపాడుకు చెందిన షేక్ కాశింషా,ఉపాధ్యక్షుడిగా నిప్పట్లపాడుకు చెందిన జంగ్రాజుపల్లి నరేష్,యాకోబు,కన్వీనర్‌గా ఇంకొల్లు అనిల్, కార్యదర్శిగా పచ్చవ నరేష్, కోశాధికారిగా ప్రకాష్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కులం పేరు మార్చడం తగదు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దొమ్మరి కులం పేరు మార్చి బలిజ అని చేర్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే విధంగా చూడాలని కాపు సంఘం నాయకులు కోరారు. కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు సూరినేని పోలేరయ్య, వల్లంశెట్టి హనుమంతరావు, మేకల నారాయణ, కే శ్రీనివాసరావు, జాష్టి శివప్రసాద్, మారిశెట్టి చంద్రశేఖర్, మిరియాల వెంకటేశ్వర్లు, వాడపల్లి రామలింగేశ్వరరావు, జల్లపల్లి పాండురంగారావు, గలగల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి ప్రదాత దామచర్ల ఆంజనేయులు

- వర్ధంతిలో మంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలాంజనేయులు కొనియాడారు. రాష్ట్ర మార్కెటింగ్, దేవదాయ శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన రైతుల అభ్యున్నతి, ఆలయాల పవిత్రత కోసం కృషి చేశారన్నారు. ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా సోమవారం తూర్పునాయుడుపాలెంలో ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ నీతి, నిజాయితీలకు నిలువెత్తు నిదర్శనం ఆంజనేయులు అని కీర్తించారు. కొండపి నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు.


దివంగత మంత్రి, తన తాత దామచర్ల ఆంజనేయులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సత్య

కుటుంబ సభ్యుల నివాళి..

దామచర్ల ఆంజనేయులు వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన మనవడు, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. తూర్పునాయుడుపాలెంలోని దివంగత ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు పూల మాలలు వేసి సత్య నివాళులర్పించారు. దామచర్ల కుటుంబ సభ్యులైన టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు, ఆయన సతీమణి విజయలక్ష్మి, దామచర్ల వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.


తూర్పునాయుడుపాలెంలో దివంగత దామచర్ల ఆంజనేయులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

పెద్దాయన ఆశయాలు కొనసాగిస్తాం

-ఎమ్మెల్యే జనార్దన్

దామచర్ల ఆంజనేయులుకు ఘన నివాళి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి, స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు ఆశయాలు కొనసాగిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆంజనేయులు 18వ వర్ధంతి పురస్కరించుకుని సోమవారం ఒంగోలులో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద, పార్టీ కార్యాలయంలోని ఎన్టీఆర్, ఆంజనేయులు విగ్రహాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయంలోనూ, సమాజ సేవలోనూ తన తాత సేవలు చిరస్మరణీయం అన్నారు. నిగర్వి, నిడారంబరుడుగా మంచి పేరు పొందిన ఆయన స్ఫూర్తి బాట తమ కుటుంబానికి ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మేయర్ గంగాడ సుజాతతోపాటు పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


ఒంగోలులోని బాపూజీ కాంప్లెక్స్ వద్ద దివంగత ఆంజనేయులు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దామచర్ల జనార్దన్

పంచాయతీల అభివృద్ధికి ఎనలేని కృషి

ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా బదిలీ అయిన బాల చెన్నయ్యకు వీడ్కోలు

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలంలోని గ్రామపంచాయతీలను అభివృద్ధి చేయటంలో ఒంగోలు డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య దిట్ట అని వివిధ గ్రామాల సర్పంచ్‌లు అన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఉద్యోగోన్నతిపై మార్కాపురం ఎంపీడీవోగా వెళుతున్న డిప్యూటీ ఎంపీడీవో ఎ .బాలచెన్నయ్యకు వీడ్కోలు సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామనాయకులు,సర్పంచ్‌లు పాల్గొన్ని మాట్లాడుతూ ఒంగోలు మండలంలో మరుగుదొడ్లు వంద శాతం నిర్మించటంలోను, ఇంకుడు గుంతలు నిర్మించడంలోను, ఉపాధి హామీపనులు నిర్వహించడంలోను ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. మండలంలో 14 గ్రామపంచాయతీలలో నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయటంలో ఆయన కృషి అభినందనీయమన్నారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో బాల చెన్నయ్యను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, కొత్తపట్నం ఇన్‌చార్జి ఎంపీడీవో యు. శేషుబాబు, పీఆర్ ఏఈ రామ్‌కుమార్, మండవవారిపాలెం సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య,దేవరంపాడు సర్పంచ్ నన్నపనేని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గుండపనేని శ్రీనివాసరావు, కరవది సొసైటీ త్రిమెన్ కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కరవది పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పోలవరపు వెంకటరామయ్య, ఉలిచి మాజీ సర్పంచ్ యర్రంనేని నరసింహారావు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

పొన్నలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్టేషన్ సమస్యలపై ఆరా తీశారు. సర్కిల్ పరిధిలో వివిధ కేసుల వివరాలు, ఇతర సమస్యలపై పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ట్రాఫిక్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పలు సూచనలు చేశారు. మండలంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

వల్లూరమ్మ ఆలయంలో 'సత్య' పూజలు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల సందర్భంగా వల్లూరమ్మ ఆలయంలో ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి గోత్రనామార్చనలు చేసి అమ్మవారి ప్రతిమ, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో రమేష్ పాల్గొన్నారు.


బాలా త్రిపురసుందరీ దేవి అలంకారంలో సింగరాయకొండలోని జాలమ్మతల్లి

బాలా త్రిపుర సుందరీదేవిగా జాలమ్మతల్లి

సింగరాయకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలో కందుకూరు రోడ్డు సెంటర్ రోడ్డులోని జాలమ్మతల్లి దేవస్థానంలో సోమవారం దేవి నవరాత్రులను ఘనంగా ప్రారంభించారు. దేవస్థానంలోని జాలమ్మతల్లిని, వేణుగోపాల్‌స్వామిని ప్రత్యేక పూలతో సుందరంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా పూజా క్రతువును నిర్వహించారు. నవరాత్రుల్లో తొలిరోజు బాలత్రిపుర సుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దాసరి యానాదిరావు పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో, సుందర్‌నగర్‌లోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవార్లకు విశిష్ట పూజలు నిర్వహించారు.

బాలాత్రిపుర సుందరీ అలంకారంలో వాసవి మాత →



ఘనంగా దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

చీమకుర్తి,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రులు చీమకుర్తిలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.పట్టణంలోని హరిహరక్షేత్రంలో వాసవిమాత తొలిరోజు బాలత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇసుకవాగు సెంటర్‌లో ఉన్న సాక్షి రామలింగేశ్వరస్వామి అలయం, వీరభద్రస్వామి ఆలయం తదితర ఆలయాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు జరిపారు.

బాలాత్రిపురసుందరీ పాలయమాం

- వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రులు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):దసర శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇక తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లావ్యాప్తంగా ఉన్న పలు దేవీ ఆలయాలకు మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం జిల్లాలో పలుచోట్ల పందిళ్లు వేసి అమ్మవారి విగ్రహాలను ఉంచి దేవీ నవరాత్రులను నిర్వహిస్తున్నారు. ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట శ్రీ విజయదుర్గాదేవి దేవస్థానం, శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, గంటాపాలెం పార్వతీ దేవస్థానం, బాలాజీరావుపేట శ్రీ పోలేరమ్మ, శ్రీ మహాలక్ష్మి దేవస్థానం, గద్దలగుంట శ్రీ రాజరాజేశ్వరి దేవి త్రిశక్తిపీఠం, మంగమూరు రోడ్డు అచలానంద ఆశ్రమం, కొత్తపట్నం రోడ్డు శ్రీ లక్ష్మీ నారసింహ స్వామి శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి ఆలయం, సంతపేట, లాయర్‌పేట సాయిబాబా మందిరాలు మొదలైన పలు దేవాలయాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష కుంకుమార్చనలు జరిగాయి. అదేవిధంగా స్థానిక శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది.


అచలానంద ఆశ్రమంలో చండీమహాదేవి అలంకరణ


బాలాత్రిపురసుందరిదేవిగా కొత్తపట్నం బస్టాండ్ వద్ద వున్న రాజరాజేశ్వరి అమ్మవారు

కలెక్టర్‌ను కలిసిన ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ పీ రాజాబాబును జిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్ రాజాబాబును కలిశారు. ఈ సందర్భంగా బొకే ఇచ్చి కలెక్టర్‌ను అభినందించారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యనమద్ది వెంకటేశ్వర్లు, పి. సునీత, పల్లె మణిందర్ దేవ్, ఎం. గురవయ్య, కత్తి అనోజీరావు తదితరులు ఉన్నారు.

సేంద్రియ కూరగాయలతోనే ఆరోగ్యం

పొన్నలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో సోమవారం సేంద్రియ కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా వ్యవసాయ అధికారి వడ్డే రాము మాట్లాడుతూ కుటుంబ ఆరోగ్యం ఇంటి ఇల్లాలిపై ఆధారపడి ఉంటుందని ప్రతి ఒక్కరూ చిన్న స్థలాల్లోనే సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు పండించుకోవచ్చని తెలిపారు. సేంద్రియ కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మందాకిని, జ్యోత్స్న, విజయలక్ష్మి, నాగరాజు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీ హర్షవర్ధన్ రాజును సన్మానిస్తున్న ఒడా చైర్మన్ రియాజ్

ఎస్పీని కలిసిన ఒడా చైర్మన్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :ఎస్పీ హర్షవర్ధన్‌రాజును జనసేనపార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఒడా చైర్మన్ షేక్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం హర్షవర్ధన్‌రాజును కలిసి శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. అదే విధంగా రవిశంకర్ గ్రూపు అధినేత, జనసేనపార్టీ నాయకులు కంది రవిశంకర్, ఒంగోలు మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ చిట్టెం ప్రసాద్‌లు ఎస్పీని కలిసి శాలువతో సత్కరించారు.

నిల్వ ఉన్న శనగలను కొనుగోలు చేయాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా లో రైతుల వద్ద నిల్వలు ఉన్న శనగలను పదివేల రూపాయలకు కొనాలని లేకుంటే మూడు వేలరూపాయలు బోనస్ ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు, కిసాన్ సంయుక్త మోర్చ నాయకులు హనుమారెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఉప్పుగుండూరు మార్కెట్ యార్డులో కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో శనగ రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా జిల్లాలో అత్యధికంగా శనగ పంట సాగు చేశారని, ధర లేకపోవడంతో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేశారని అన్నారు. ప్రస్తుతం ధర దిగజారి నందున కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ ఉన్న శనగలను పదివేలకు కొనాలని లేదా మూడు వేలు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు టి. శ్రీకాంత్, జి. బసవపున్నయ్య, చెరుకూరి వాసు, గాదే నాగేశ్వరరావు, వివిధ గ్రామాల శనగ రైతులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడ చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వరకుమార్, పైపాలెం తాలూకా అధ్యక్షుడు జానీ బాషా తదితరులు ఉన్నారు.

ఆర్టీసీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

సంతనూతలపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏఎస్సై వెంకట్రావు తెలిపిన సమాచారం మేరకు శ్రీశైలం నుంచి వెంకటగిరి వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆదివారం రాత్రి 11.30 గంటలకు మండలంలోని ఎండ్లూరు డొంకవద్ద వెనుకనే వేగంగా వస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈప్రమాదంలో ఆర్టీసీ రోడ్డుపక్కనే ఉన్న చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈప్రమాదంలో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సంతనూతలపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనికపాడు గ్రామంలో నాయీబ్రాహ్మణ కాలనీ వెళ్లే రోడ్డును గ్రామంలోని కొందరు ఆక్రమించి రాకపోకలను అడ్డుకుంటున్నారని సోమవారం ఒంగోలు కలెక్టరేట్ జరిగిన గ్రీవెన్స్‌లో బాధితులు వినతిపత్రం అందజేశారు. రహదారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరి కే.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నివేశన స్థల పట్టాలు ఇవ్వాలి

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):వలేటి వారిపాలెం గ్రామ ఎస్సీకాలనీలోని ఖాళీ స్థలాలను సర్వే చేసి పేదలైన ఎస్సీలకు నివేశన స్థల పట్టాలు ఇవ్వాలని గ్రామ ఎస్సీలు సోమవారం రూరల్ తహసీల్దార్ షేక్. నాయబ్ రసూల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో టి.పృధ్వీరాజ్, ఎం.కృష్ణ, కె.మోహన్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన దసరా నవరాత్రులు

త్రిపురాంతకం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మార్కాపురం వన్‌టౌన్ : దసరా శరన్నవరాత్రులు మార్కాపురం పట్టణంలో సోమవారం వైభవంగా, భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో అభిషేకం, బాల భోగ నివేదన, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారు తొలిరోజు రాజ్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.



మార్కాపురంలో శైలపుత్రి, గిద్దలూరులో రాజరాజేశ్వరి

బేస్తవారపేట : బేస్తవారపేట గ్రామంలో దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, బీసీ కాలనీలోని చౌడేశ్వరీ దేవి అమ్మవారు. దరగ రోడ్డులో ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గిద్దలూరు : దసరా శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ ఆర్య వైశ్య పతాకాన్ని ఆవిష్కరించి దసరా నవరాత్రులను ప్రారంభించారు. కుసుమ హరనాథ మందిరం నుంచి మహిళలు సామూహికంగా తీసుకుని వచ్చిన గంగాజలంతో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. మహిళలు కలిశాలు ఎత్తి మొక్కులు తీర్చుకున్నారు.

పొదిలి : దక్షిణ కాశీగా పేరొందిన శ్రీశ్రీ పార్వతీసమేత నిర్మమహేశ్వరస్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రులు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు పార్వతీదేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కంభం : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కంభంలో అమ్మవారు మొదటి రోజు సోమవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ కోటా సత్యమాంబ దేవి అమ్మవారు మొదటి రోజు కోటా సత్యమాంబగా దర్శనమిచ్చారు. దేవాలయ ప్రాంగాణాలలో రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పెద్ద దోర్నాల : దోర్నాల, తిమ్మాపురంలో దేవి శరన్నవరాత్రులు సోమవారం ప్రారంభమయ్యాయి. దోర్నాలలో వాసవీ కన్యకా పరమేశ్వరి, పోలేరమ్మ అమ్మవారి దేవాలయం, ఇతర ఆలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి.



మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

మార్కాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ ముస్లిం, మైనార్టీ నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఇబ్రహీంఖాన్ మాట్లాడుతూ ఈ మధ్యనే మైనార్టీలు పట్టణంలోని రెసిడెన్షియల్ స్కూల్ అవసరమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. మైనార్టీ విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే విద్యా శాఖ మంత్రి లోకేశ్‌ను కలిసి సమస్యను వివరించారన్నారు. అంతేకాక ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో మార్కాపురం ప్రాంత ముస్లిం విద్యార్థుల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు పఠాన్ హుసేన్‌ఖాన్, గులాబ్, మొఘల్ షాకీర్‌హుసేన్‌బేగ్, సయ్యద గఫార్, బుల్లెట్ నాగూర్, షరీఫ్, కరీంసా పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపై వాన నీరు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రహదారిపై నిలిచిన వరద

రాచర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకవీడు గ్రామంలో ప్రధాన ప్రధాన రహదారిపై మోకాళి లోతు వాన నీరు నిలిచి ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరంతా రోడ్డుపై చేరి కుంటను తలపిస్తోంది. రోడ్డుపై నడవాలంటే పాదచారులు, ద్విచక్ర వాహనదారుల పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు పోయే మార్గం లేక రోడ్డుపై నిలిస్తోంది. ఆర్టీసీ బస్సులు, తదితర వాహనాలు తిరిగే సమయంలో నీరంతా చింది మనుషులపై పడడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య చాలా కాలం నుంచి ఉందని సంబంధిత అధికారులకు స్థానిక పాలకులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, దీంతో ఈ సమస్య సమస్యగానే మిగిలిపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రడ్డుపై నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నా స్థానిక పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో నిధులు వృథా అవుతున్నాయి తప్ప సమస్య పరిష్కారం కావడం లేదన్నారు.

అందుబాటులో యూరియా

త్రిపురాంతకం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా అందుబాటులో ఉందని ఏవో బి.సంగమేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మన గ్రోమోర్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో 156 టన్నుల యూరియా అందుబాటులో ఉందని అవసరమైన రైతులు తీసుకోవాలని ఆయన కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కొనకనమిట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగుంట గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి పారిశుధ్య పనులను డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి సోమవారం పరిశీలించారు. స్వామిత్వ వెక్టోరేజేషన్, డెవలప్‌మెంట్ యాక్టివిటీస్, సర్వీసెస్ గతసంవత్సర ఇంటిపన్ను బకాయిల రికార్డులను ఆయన పశీరిలించారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులంతా ప్రజలకు అవసరమైన సేవలందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఈవోపీఆర్డీ శ్రీదేవి, పంచాయితీ కార్యదర్శులు, ఇం జనీరింగ్ అసిస్టెంట్‌లు, సర్వేయుర్లు పాల్గొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

రాచర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 29న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ షేక్ ఖాశింబి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఎస్.వెంకట రామిరెడ్డి తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గిద్దలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో స్వరూప్, దివ్య, సుజిత్, జూనియర్స్ విభాగంలో హర్షిత్‌రెడ్డి, భవ్య, సాద్యులు విజయం సాధించగా యువప్రగతి పథం సంస్థ ప్రతినిధి కిశోర్ బహుమతులను అందజేశారు. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ఫరూఖ్ పాల్గొన్నారు.



కంటి విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు

పేదలకు మెరుగైన వైద్య సేవలు

ఆరోగ్య కేంద్రంలో కంటి విభాగాన్ని ప్రారంభించిన ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన కంటి విభాగాన్ని ఎరిక్షన్‌బాబు సోమవారం ప్రారంభించారు. వైద్యం కోసం గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ క్రమంలోనే కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేయడం పేదలకు భరోసా అన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని త్వరలోనే సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగమహేశ్వరి, వైద్యులు సంజీవ్, లావణ్య, కృష్ణారెడ్డి, సిబ్బంది, సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు షేక్‌మాబు, దొడ్డా శేషాద్రి, మల్లయ్య, చంటి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, చెంచయ్య, సమ్మద్‌బాషా, బీజేపీ నేత గండి వీరారెడ్డి, జిల్లా నాయకులు అశోక్‌రెడ్డి, సీతారెడ్డి, జనసేన పార్టీ అధ్యక్షుడు కేతి మురళి పాల్గొన్నారు.

కొనకనమిట్ల : మండలంలోని సిద్దవరం గ్రామంలో సోమవారం డాక్టర్ బాలయ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 152 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

పొదిలి : ఆరోగ్యవంతమైన మహిళా తన కుటుంబాన్ని శక్తివంతమైన కుటుంబంగా తయారు చేస్తుందని డాక్టర్ శరత్‌చంద్ర అన్నారు. సోమవారం సచివాలయం 1 ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, శివాలయం మాజీ చైర్మన్ శామంతపూడి నాగేశ్వరావు, వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


గిద్దలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించి అనేక వస్తువుల రేట్లు భారీగా తగ్గేందుకు కారణమైన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు బీజేపీ నాయకులు గాంధీబొమ్మ సెంటర్‌లో పాలాభిషేకం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, రామాంజనేయులు, కె.నాగేశ్వరరావు, చంద్రమోహన్, బాదుల్లా, నరసింహులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్‌లో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని వైపాలెం నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయం వద్ద రామయ్య, నాయకులు సోమవారం పార్టీ జెండా అవిష్కరించారు. కార్యక్రమంలో పీ తిరుమలయ్య, మస్తాన్, రాములు, మద్దయ్య, ఏజీటీయూ నాయకులు పాల్గొన్నారు.









పశుపోషకుల అభివృద్ధే లక్ష్యం

ముండ్లమూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పశుపోషకుల అభివృద్ధే లక్ష్యమని జిల్లా పశుసంవర్థక శాఖ సంచాలకులు బి.రవి అన్నారు. సోమవారం ముండ్లమూరులో పశువైద్యశాలను ఆయన సందర్శించారు. పోలవరంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందుజాగ్రత్త చర్యగా ఈనెల 15 నుంచి అక్టోబరు 14 వరకు జిల్లావ్యాప్తంగా 6.02 లక్షల టీకాలు వేయనున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు రెండు లక్షల పశువులకు టీకాలు వేసినట్టు చెప్పారు. జిల్లాలో గోకులం షెడ్లు నిర్మించినట్టు చెప్పారు. జిల్లాలో పశుగ్రాసం కొరత ఎక్కడా లేదన్నారు. పశువైద్యశాలలో మందులు కొరత లేదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి వంశీ, వెటర్నరీ సిబ్బంది రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, గోపాల మిత్ర ఏడుకొండలు, మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, సొసైటీ అధ్యక్షుడు వీరనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు కంకణాల వెంకటరావు, కోటయ్య, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు

» వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం

దర్శి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో దేవి శరన్నవరాత్రులు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దర్శి పట్టణంలోని కనకదుర్గమ్మ, పోలేరమ్మ దేవాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, దద్దాలమ్మ గుడిలో అమ్మవారు తొలిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చి పూజలందుకున్నారు. మహిళలు అధికసంఖ్యలో ఆలయాలకు వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో దేవి శరన్నవరాత్రుల వేడుకలు ఘనంగా ప్రారంభించారు. మొదటిరోజు శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా ఈశ్వర మహదేవి దర్శనమిచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలో దేవీశరన్నవరాత్రులు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని మారెళ్ళ శివాలయంలో భ్రమరాంబ అమ్మవారిని బాలాత్రిపురసుందరి దేవిగా అలంకరణచేశారు. పులిపాడు, ఈదర, ముండ్లమూరు, పసుపుగల్లు, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం గ్రామాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

కురిచేడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కురిచేడులో సోమవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయం, వాసవీ అలయం, శ్రీనివాసనగర్‌లోని దుర్గామాత ఆలయాలలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమఅయ్యాయి. సాగర్ కాలువ నుంచి కృష్ణానది జలాలను మంగళవాయిద్యాల మధ్య ఆలయాలకు తీసుకువచ్చి సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.

తాళ్లూరు: తాళ్లూరులోని కన్యకాపరమేశ్వరి, శ్రీవేణుగోపాల స్వామి ఆలయం, తూర్పుగంగవరంలో వాసవీమాతా ఆలయం, గుంటిగంగభవానీ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్లను బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. తాళ్లూరు, తూర్పుగంగవరం ఆలయాల్లో దుర్గామాతకు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



తాళ్లూరు:గుంటిగంగభవానీ ఆలయంలో బాలాత్రిపుర సుందరీగాఅమ్మవారు



దర్శి: బాలాత్రిపుర సుందరీ దేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు

నేరాల నియంత్రణకు చర్యలు

» ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



పామూరు పోలీస్‌స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏస్పీ హర్షవర్ధన్‌రాజు

పామూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. సోమవారం రాత్రి పామూరు పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం సర్కిల్ కార్యాలయాన్ని కూడా పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎప్పటికప్పుడు కేసులు పరిష్కరించాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి పోలీస్‌శాఖపై మరింత నమ్మకం కలిగించేలా ఉత్తమ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ కె.రాఘువేంద్ర, కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు, లు ఉన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

పీసీపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను క్షుణ్ణంగా విచారించి పరిష్కరించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని త్వరితగతిన కేసులను ఛేదించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్, ఏస్సై కోటయ్య పాల్గొన్నారు.

బోర్డు అనుమతించిన మేరకే పొగాకు సాగుచేయాలి

కనిగిరి సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బోర్డు నిర్ణయించిన పంటపరిమితి మేరకు రైతులు ఉత్పత్తి చేయాలని టుబాకో బోర్డుచైర్మన్ యశ్వంత్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ వచ్చే సీజన్‌లో ప్రతి బ్యారెన్ నుంచి 3665 కేజీలు మాత్రమే పండించాలన్నారు. పొగాకు పంటను నియంత్రించుకుని నష్టాలపాలు కాకుండా రైతులు జాగ్రత్తపడాలన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి బండి కోటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

నిమ్జ్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేయాలి

పామూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండాపురం వద్ద ఏర్పాటుచేసిన నిమ్జ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల అంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం బోడవాడ, అయ్యన్నకోట, లింగన్నపాలెం గ్రామాల్లోని నిమ్జ్ భూములను పరిశీలించారు. కార్యక్రమంలో బడుగు వెంకటేశ్వర్లు, వై.వీరనారాయణ, కె.మాల్యాద్రి పాల్గొన్నారు.

వృత్తివిద్య కోర్సులతోనే ఉజ్వల భవిష్యత్తు

తాళ్లూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వృత్తివిద్య కోర్సులతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంక్ తూర్పుగంగవరం శాఖ మేనేజర్ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం తూర్పుగంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఓటర్ల జాబితాలో తప్పులులేకుండా చూడాలి

తాళ్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా సరిచూడాలని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2002 ఓటర్ల జాబితాను, 2025 ఓటర్ల జాబితాలను సరిచూడాలన్నారు. రెండు జాబితాలను సరిచూసి పొరపాట్లు లేకుండా జాబితాను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోపాలునిఫణి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.58 వేలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ. 58,338 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు.

చివరి భూములకూ నీరందిస్తాం

ముండ్లమూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి మేజరు పరిధిలో చివరి భూములకూ నీరందిస్తామని ఎన్ఎస్పీ డీఈ బి.పూర్ణచందు అన్నారు. సోమవారం మోదేపల్లి మేజరు కాలువకు సరఫరా అవుతున్న సాగర్ జలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మేజరుకు 398 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా 290 క్యూసెక్కులు వస్తుందన్నారు. కార్యక్రమంలో జేఈ కాంతి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం ఎంపీడీవోగా ప్రతాప్‌రెడ్డి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం ఎంపీడీవోగా వి.ప్రతాప్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లాలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతి ద్వారా సీఎస్‌పురం మండలానికి వచ్చారు.

మహిళలు ఆరోగ్యవంతంగా ఉండాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆరోగ్య వంతంగా ఉండాలని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పూరిమెట్లలో జరిగిన స్వస్త్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కోడెగ మస్తాన్‌రావు, ఎంపీటీసీ చింతపల్లి వెంకటేశ్వరరావు, చొప్పరపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: ఆరోగ్యవంతమైన మహిళా తన కుటుంబాన్ని శక్తివంతమైన కుటుంబంగా తయారు చేస్తుందని ఎంపీడీవో క్రిష్ణారావు అన్నారు. సోమవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన స్వస్త్‌నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో అయన మాట్లాడారు. వైద్యాధికారి యుషిత ఆధ్వర్యంలో 306 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో 1, 2 సంజీవ్, శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ, డాక్టర్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన భూముల్లో వజ్రాల వేట

పామూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పామూరు దేవస్థానాలకు చెందిన భూముల్లో రాయలసీమ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు రంగురాళ్ల కోసం వెదుకులాట ప్రారంభించారు. బద్వేల్ ప్రాంతానికి చెందిన 12 మంది పాల్గొన్నారు. దేవస్థాన భూముల్లో రాళ్లను తీయడం నేరమంటూ అడ్డుకొని వాళ్లను వెనక్కి పంపినట్లు దేవస్థాన సిబ్బంది తెలిపారు.

జీవో నెం.1793ను రద్దు చేయాలి

పామూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాపులకు నష్టం కలిగించే జీవో నెంబరు 1793 రద్దు చేయాలని పామూరు కాపుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు ఉప్పలపాటి హరిబాబు, ఆకుపాటి వెంకటేష్, ఎన్.సాంబయ్య, కేవీ రమణయ్య, ఉమ్మడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట

పామూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట కలిగిందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. సోమవారం స్థానిక మమ్మీ డాడి సెంటర్ వద్ద సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా మోదీ, నిర్మలాసీతారామన్ ఫ్లెక్సీలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల ప్రతినిధుల ర్యాలీ

దర్శి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ కళాశాలల యజమానులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. పొట్టిశ్రీరాములు డిగ్రీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పెద్దిరాజు ఆధ్వర్యంలో పలు కళాశాలల ప్రతినిధులు స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, పలు కళాశాలల ప్రతినిధుల పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి



బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 23 సెప్టెంబరు 2025

థర్డ్ పార్టీలతో ప్రమాదం..

ఈ-కామర్స్ సంస్థలు నమ్మకస్తులైన అమ్మకందారులనే వినియోగదారుల ముందుకు తీసుకు రావాలి. కానీ, ఇటీవల థర్డ్ పార్టీ అమ్మకందారులను కూడా తీసుకు వస్తున్నాయి. వారు ఇచ్చే ఆఫర్లను బ్యానర్లుగా కూడా ప్రమోట్ చేస్తున్నాయి. ఈ కారణంగా ఎక్కువ మంది వాటి ఉచ్చులో పడుతున్నారు. తీరా వారు ఆర్డర్ చేసుకున్న ప్రొడక్టు పాతది లేక.. రీ ఫర్బిష్ రావడమో జరుగుతోంది. ఈ విషయం తెలియక చాలామంది వాటిని కొత్త వస్తువులుగా భావించి మోసపోతున్నారు. ఒకవేళ వాటిని గుర్తించినా.. రిటర్న్ చేయడానికి అవకాశం కూడా ఉండడం లేదు.

ఆన్‌లైన్ అమ్మకం..బాదుడు

- ఈ కామర్స్ సైట్లలో భారీగా అక్రమాలు
- ప్లాట్‌ఫామ్, ఆఫర్, హ్యాండ్లింగ్ ఫీజుల పేరుతో భారీగా వడ్డన
- నో రీఫండ్.. రిటర్న్ ఆప్షన్ తొలగిస్తున్న వైనం..
- తప్పుడు ప్రొడక్టు వచ్చినా స్పందించని వైనం



పండగల వేళ..పెరిగిన ఆన్‌లైన్ కొనుగోళ్లు..

బాపట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ పండుగలు దసరా, దీపావళి సందర్భంగా భారీ స్థాయిలో కొనుగోళ్లు జరుగుతుంటాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఈ రెండు పండగల సందర్భంలో రూ.200 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని అంచనా. అందులో సుమారు రూ.150 కోట్లు ఆన్‌లైన్ వ్యాపారమే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఏడాది పాటు జరిగే వ్యాపారంతో సమానంగా ఈ రెండు పండగల సమయంలోనే జరుగుతుందంటే.. ఎంత భారీ స్థాయిలో వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారో ఇట్టే అంచనా వేయవచ్చు. సగటున ప్రతి వంద మంది కొనుగోలు దారుల్లో

(మిగతా 6వ పేజీలో)

ఈ-కామర్స్ సంస్థలు వచ్చిన తర్వాత జనం షాపులకు వెళ్లి వస్తువులు కొనడమే దాదాపుగా మానేశారు. స్మార్ట్ ఫోన్ చేతిలోకి తీసుకోవడం, నచ్చిన ప్లాట్‌ఫాంను ఎంచుకోవడం.. కావాల్సినవి ఆర్డర్ పెట్టుకోవడం.. వారం రోజుల్లో అవి మన గడప దగ్గరకు వచ్చి చేరడం జరిగిపోతోంది. ఈ సులభతర పద్ధతుల కారణంగా మధ్యతరగతి ప్రజలు ఆన్‌లైన్ కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు అన్ని బ్యాంకులు క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో భారీ డిస్కౌంట్లు ఇస్తుండడంతో.. స్థానిక మార్కెట్లను పూర్తిగా మర్చిపోయారు. ఇదే ఈ-కామర్స్ సంస్థలకు వరమైంది. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని ఇష్టం వచ్చినకాడికి వినియోగదారులపై బాదుడు మొదలు పెట్టాయి. రకరకాల ఫీజుల పేరుతో జేబులు ఖాళీ చేస్తున్నాయి. రానున్న దసరా, దీపావళి పండగల సందర్భంగా వచ్చే డిస్కౌంట్ ఆఫర్లతో అప్రమత్తంగా లేకపోతే నష్టపోవడం ఖాయం!



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రులు రవికుమార్, డీబీవీ స్వామి

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్
- 400 మంది విద్యార్థులకు
- సైకిళ్ల పంపిణీ
- అద్దంకిలో ఎస్సీ బాలికల వసతిగృహం : మంత్రి డీబీవీ స్వామి

అద్దంకి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. నెడ్‌క్యాప్ సహకారంతో 400 మంది విద్యార్థులకు సైకిళ్లను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామితో కలిసి సోమవారం ఆయన పంపిణీ చేశారు. అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో..స్థానిక పాఠశాల విద్యార్థులు 300 మంది, గొరకాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 మందికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డీబీవీ స్వామి మాట్లాడుతూ సైకిల్‌పై విద్యార్థులు పాఠశాలకు రావడం ద్వారా సమయం ఆదా అవుతుందని, ఆ సమయాన్ని చదువుకునేందుకు వినియోగించుకోవాలన్నారు. అద్దంకిలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంత్రి రవి కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో సైకిల్ యాత్ర చేసే సమయంలో విద్యార్థులు సైకిళ్లు లేక ఇబ్బంది పడటాన్ని గమనించానని తెలిపారు. అన్ని పనులు ప్రభుత్వం చేయలేదని, అందువల్ల దాతల సహకారంతో నియోజకవర్గంలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 10 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే 3 వేల మందికి అందజేయడం జరిగిందన్నారు. అదే సమయంలో దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్య క్రమంలో చీరాల డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గంగాధరరావు, ఎంఈఓ-2 కేవీ శ్రీనివాసరావు, హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.





శ్రీ బాలాత్రిపురసుందరిదేవిగా

శ్రీబగళాముఖి

బాపట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాల్లో అమ్మ వార్లకు వివిధ అలంకరణలు గావించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారిని శ్రీబాలాత్రిపురసుందరిదేవిగా అలంకరించారు.

అభివృద్ధిలో..టాప్-3లో ఉండాలి

- 26, 27న అధిక వర్షాలు పడొచ్చు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సమీక్షలో బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్

రేపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధిలో బాపట్ల జిల్లా రాష్ట్రస్థాయిలో టాప్-3లో ఉండేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని అలసత్వం వహిస్తే ఉపేక్షించేదిలేదని బాపట్లజిల్లా కలెక్టర్ వీ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొంత మంది తహసీల్దార్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇకనుంచి అలాజరిగితే తగిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 7గంటలలోపు కలెక్టర్ కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులకు ఫోన్లు వస్తాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈఆఫీస్‌ద్వారానే అన్నిఫైల్స్ కలెక్టర్ కార్యాలయానికి అన్నిశాఖల అధికారులు పంపించాలని సూచించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. 26,27 తేదీల్లో బాపట్ల జిల్లాలో భారీవర్షాలు వచ్చే అవకా శం ఉందనే సమాచారం ఉందని, అధికారులు అందరూ సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృష్ణానదికి వరద తీవ్రత దృష్ట్యా, తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పారిశుధ్యంపై అధికారులు దృష్టిపెట్టాలని అక్కడకక్కడ కొబ్బరి బొండా చిప్పలు, చెత్తడిబ్బలు ఉన్నాయని వాటిని తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ సెక్రటరీలు చూడాలని డీపీవోలను ఆదేశించారు. వానాకాలం జ్వరాల నియం త్రణకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు వైద్య సిబ్బంది అందరూ ఆసుపత్రి, పీహెచ్‌సీలలో అందుబాటులో ఉండాల న్నారు. అనంతరం రేపల్లె మండలం పెనుమూడి వారధి సమీపంలో వరద ఉధృతిని పరిశీలించారు. భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం తూర్పుపాలెం ప్రాంతాల్లో గతంలో కరకట్టకు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. కరకట్టకు నిర్వహించాల్సిన మరమ్మతులను ఏవిధంగా చెయ్యాలనే దానిపై ఇరిగేషన్, ఆర్‌సీ,ఏఈలకు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మీ, డీఎస్పీ ఆవులశ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఓలేరుపల్లెపాలెం వద్ద గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జీఎస్టీ 2.0పై ఎంపీ తెన్నేటి ప్రచారం

బాపట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలపై బాపట్ల పట్టణంలోని రధం బజారులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ నేరుగా నిత్యావసర, మెడికల్, ఎలక్ట్రికల్ దుకాణాల వద్దకు వెళ్లి.. పేద, మధ్యతరగతి వర్గాలకు నూతన సంస్కరణల వల్ల ఎంత మేలు చేకూరనుందో వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల వల్ల ఫార్మా రంగంపై పన్ను 12 శాతం నుంచి 5 శాతం, సిమెంట్ అండ్ కనస్ట్రక్షన్‌లో 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిందని వివరించారు. పిల్లల చదువుకు సంబంధించిన వస్తువులపై వస్తు సేవల పన్ను లేదని తెలిపారు. ప్రతి దుకాణ యజమాని జీఎస్టీకి సంబంధించిన బోర్డులను ప్రజలకు అర్థమయ్యే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



జీఎస్టీ సంస్కరణల అవగాహన ర్యాలీలో ఎంపీ కృష్ణప్రసాద్



వృద్ధుడి వద్ద అర్జీ తీసుకుంటున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

మానవీయ కోణంలో

సమస్యలకు పరిష్కారం

బాపట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మానవీయ కోణంలో అర్జీలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. అర్జీదారులతో ఆయన ఆప్యాయంగా మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కారం చూపాలని కోరారు. భట్టిప్రోలుకు చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి, 80 ఏళ్ల వృద్ధుడు బత్తుల సుబ్బారావు తన సమస్యను చెప్పుకోవడానికి వచ్చారు. ఆయన నడవలేక ఇబ్బంది పడుతుండడంతో సిబ్బంది ద్వారా తెలుసుకుని.. ఎస్పీ స్వయంగా ఆయన వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. 65 మంది పీజీఆర్ఎస్‌లో సమస్య పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో!


నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు

- గత టీడీపీ హయాంలో నిరంతరాయంగా ప్రక్రియ
- వైసీపీ రాకతో ఆ విధానానికి స్వస్తి
- కూటమి ప్రభుత్వం రాకతో లబ్ధిదారుల్లో ఆశలు
- కార్యాలయాలకు వెల్లువలా దరఖాస్తులు, వినతులు
- కొండంత ఆశతో ఎదురుచూస్తున్న ఆశావహులు
- నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు

రేపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం కొండంత ఆశతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పింఛనుకు దూరమైన అనేక మంది కూటమి ప్రభుత్వం రాకతో తమకు అవకాశం వస్తుందన్న ఆశతో 15 నెలలుగా ఎదురు చూస్తున్నారు. నిరంతరాయంగా పింఛను దరఖాస్తులు, వినతులు వెల్లువలా ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల కార్యాలయాలను ముంచెత్తుతున్నాయి.

● నాడు అలా.. ఇప్పుడు ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన పింఛను కోసం దరఖాస్తు చేసుకునే వీలుండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం కలిగేది. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానాన్ని తెర మీదకి తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆరు నెలలకు జాబితా రూపొందించిన దాఖలాలు లేవు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక పాత పద్ధతిలో ప్రతి నెలా పింఛను దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందని అందరూ భావించారు. కానీ, ఆ ఊసే లేదు.



● బాధితులకు న్యాయమెప్పుడు..?

గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్త పింఛన్ల నమోదును నిరంతర ప్రక్రియగా చేస్తే.. వైసీపీ ప్రభుత్వం పింఛనుదారులను ఘోరంగా వంచిస్తూ నిబంధనల పేరుతో వడపోత మొదలు పెట్టింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని, ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్సు చెల్లించారని, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని, నాలుగు చక్రాల వాహనం ఉందని, పరిమితికి మించి ఇళ్ల స్థలాలు, పొలాలు ఉన్నాయన్న నెపంతో వేలాది మందిని పింఛను పథకానికి అనర్హులను చేసి తొలగించింది. ఇలా ఒకసారి తొలగిస్తే వారికి మళ్లీ అవకాశం రావడానికి ఆరు నెలలు పడుతుంది. అలా కోల్పోయిన పింఛన్లు వైసీపీ హయాంలో తిరిగి వచ్చిన దాఖలాలు లేవు.

కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే పింఛనును రూ. 3 నుంచి 4 వేలకు పెంచింది. దానికి తోడు బీసీ, ఎస్సీ, ఎస్టీ పింఛనుదారుల వయోపరిమితిని 50 ఏళ్లకు తగ్గిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఉన్నారు. దీంతో వారంతా కొత్త నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సుమారు 50 వేల మంది వరకూ అర్హులైన వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలు కొత్తగా పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు.

ఎరువులపై 'అగ్రహార' రైతుల ఆందోళన

బల్లికురవ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టదారు పాసు పుస్తకాలు లేవని తమకు ఎరువులు ఇవ్వడం లేదని అగ్రహార భూముల సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి తదితర గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల అగ్రహార భూములున్నాయి. ఈ భూములకు ఎలాంటి పట్టాదారు పుస్తకాలు లేవు. రైతులు దశాబ్దాల నుంచి ఈ భూములను సాగు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాసు పుస్తకాలు ఉన్న రైతులకే ఎరువులు ఇస్తామని అని చెబుతుండటంతో సాగుదారులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు మాత్రం రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు ఇస్తామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సక్రమంగా అందించడం లేదని రైతులు వాపోతున్నారు. వరి సాగు మొదలైందని.. సకాలంలో ఎరువులు అందించకుంటే తీవ్రంగా ఇబ్బంది పడతామని రైతులు అంటున్నారు. పాసు పుస్తకాలతో సంబంధం లేకుండా ఎరువులు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆన్‌లైన్ వివరాలతో ఎరువులు: ఏవో

అగ్రహార భూముల సాగుదారులకు ఎరువులు ఇవ్వడం లేదనే ఆరోపణపై మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. పాసు పుస్తకాలు లేకున్నా.. ఆన్‌లైన్ వివరాలు తీసుకుని ఎరువులు అందజేస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

కారుమంచి మేజర్ కర్షకుల కడ'గండ్లు'

నాలుగేళ్ల క్రితం క్వారీ గుంతలోకి కుప్పకూలిన కెనాల్

పునరుద్ధరణను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ఎన్నికలనాటి హామీ అమలుకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కృషి

రూ.2.60కోట్లు డీఎంఎఫ్ నిధులు మంజూరు

టెండర్లు పిలిచే దశలో సీఈ అత్యుత్సాహంతో సీన్ రివర్స్

కట్ట కూలటానికి కారణమైన క్వారీ యాజమాన్యంతో ఆయన సంప్రదింపులు

ఈ పరిస్థితుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చిన ఇరిగేషన్ శాఖ రాష్ట్ర సెక్రటరీ

జలాశయాల్లో నిండుగా నీళ్లున్నా రైతులకు ఒనగూరని ప్రయోజనం

నేడు చలో కలెక్టరేట్‌కు పిలుపు

చీమకుర్తి,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఇరిగేషన్‌శాఖ జిల్లా అధికారులు, నాలుగు మండలాలలో ఉన్న అధికార పక్ష నాయకులు వీరందరి ఆశయాన్ని ఒక్క అధికారి నిర్వాహకం నీరుగార్చేలా చేసింది. రైతులతో పాటు వేలాది మంది ప్రజలకు గుక్కెడు తాగునీళ్లు ఇవ్వలేని పరిస్థితిని కల్పించింది. నాలుగు మండలాల పరిధిలో దాదాపు ఇరవై వేల ఎకరాల ఆయకట్టు, పద్దెనిమిది గ్రామాల ప్రజలకు తాగునీరు అందించే కారుమంచి మేజర్ కట్ట.. క్వారీయింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రానైట్ యాజమాన్యం నిర్వహించిన కార్యకలాపాలతో కూలిపోయింది. నాడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం మేజర్ పరిధిలో ఉన్న ప్రాంతం సింహభాగం తెలుగుదేశం వారే ఉన్నారన్న ఏకైక కారణంతో కాలువ పునరుద్ధరణను గాలికి వదిలేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించిన ప్రస్తుత ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రజల ఆవేదన గమనించి చలించిపోయారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే కారుమంచి కెనాల్ పునరుద్ధరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలవటంతో వెంటనే కారుమంచి కెనాల్ పునరుద్ధరణపై దృష్టి సారించారు.



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఎన్ఆర్ఐలు నల్లూరి వెంకట శేషయ్య, తక్కెళ్లపాటి రమేష్

కాలువ ఆయకట్టు గ్రామం కేవీ పాలేనికి చెందిన ఎన్ఆర్ఐ నల్లూరి వెంకటశేషయ్య తన సొంత నిధులు దాదాపు రూ.25లక్షలను ఖర్చుపెట్టి కాలువకు తాత్కాలిక మరమ్మతులు చేసి 30 క్యూసెక్కులు నీరు వెళ్లేలా చేశారు. మేజర్ పరిధిలో ఉన్న బూసరపల్లి గ్రామానికి చెందిన మరో ఎన్ఆర్ఐ తక్కెళ్లపాటి రమేష్, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాలువను సందర్శించారు. కట్ట శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణకు డీఎంఎఫ్ నిధులను మంజూరు చేయాలని నాటి కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందచేశారు. స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో కలిసి కుప్పకూలిపోయిన కట్టను పరిశీలించారు. తక్షణమే కట్ట పునరుద్ధరణకు డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి రూ.2.60కోట్లు నిధుల అవసరమని నివేదికను అందచేశారు. ఈ నిధులు మంజూరుకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఫైల్‌ను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వద్దకు తీసుకెళ్లి రైతుల కష్టాను వివరించి ఆమోదింపచేశారు. ఇక టెండర్లు పిలవటమే తరువాయి అన్న తరుణంలో సీన్ రివర్స్ అయింది.

ఆయకట్టు రైతాంగం ఆక్రందన...

కారుమంచి మేజర్ పరిధిలో దాదాపు 20వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 18 గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాల్సి ఉంది. కెనాల్ కుప్పకూలక ముందు కాలువ ద్వారా రామతీర్థం జలాశయం నుంచి 130 క్యూసెక్కులు సరఫరా అవుతాయి. ఎటువంటి ఇబ్బంది లేకుండా పంటలు పండించుకొనేవారు. కాలువ కూలిన తర్వాత తాత్కాలికంగా కాలువను బైపాస్ చేసి పట్టలు కప్పి 30 క్యూసెక్కుల మేర నీటిని ఎంతో కొంత ఉపశమనం కల్గించేలా అప్పటినుంచి సరఫరా చేస్తున్నారు. దీనివలన పంటలకు సరిపడా నీరందక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుతం జలాశయాలు నిండుగా ఉన్నా కారుమంచి మేజర్ రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.

ఉద్యమానికి సిద్ధమైన రైతులు

తమ కష్టాలు గట్టెక్కుతున్నాయి.. కారుమంచి మేజర్ పునరుద్ధరణ పనులు ప్రారంభం కాబోతున్నాయి అని ఆశగా ఎదురు చూస్తున్న రైతులకు పనులు ప్రారంభయ్యే అవకాశం లేదన్న వార్త తెలిసి రగిలిపోతున్నారు. ఐక్య కార్యాచరణ ఉద్యమానికి రంగం సిద్ధం చేశారు. దీనిలో భాగంగా మంగళవారం ఆయకట్టు రైతులు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తదుపరి ఉన్నతాధికారుల నుంచి స్పందన రాకపోతే చలో అసెంబ్లీ నిర్వహించి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇరిగేషన్ మంత్రి రామానాయడుని ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో కలిసి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకోవాలని యోచిస్తున్నారు.

కథ నడిపిన సీఈ

నిధులు మంజూరు కావటంతో టెక్నికల్ అనుమతులు కోసం ఇరిగేషన్ శాఖాధికారులు సీఈకి నివేదించారు. వెంటనే ఆమోదం తెలపాల్సిన సదరు ఉన్నతాధికారి తీసుకున్న నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారింది. కట్ట కూలిపోవటానికి కారణమైన క్వారీ యాజమాన్యానికే ఆయన కట్ట పునరుద్ధరణపై అధికారికంగా లేఖ రాయటం సమస్యను తెచ్చిపెట్టుకున్నట్లయింది. 2023లో క్వారీ యాజమాన్యం అప్పటి ప్రభుత్వానికి ఓ వినతిపత్రం అందచేసింది. కట్ట కూలిన ప్రాంతాన్ని తమకు అప్పగిస్తే కాలువ వెళ్లే మార్గాన్ని మార్చి కొత్తగా కాలువను తమ ఖర్చులతో పునరుద్ధరిస్తామని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది. దీంతో క్వారీ యాజమాన్యం మౌనం దాల్చింది. ఇప్పటికే ఈ క్వారీలో అనుమతించిన దానికంటే ఎక్కువ లోతులో అదీ బఫర్ జోన్ నిబంధనలను ఉల్లంఘించి ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న భూమిలోకి వచ్చి మరీ క్వారీయింగ్ చేయటంతో కట్ట కూలిపోవటానికి ప్రధాన కారణమైందని అపుడు విచారణ జరిపిన అధికారులు నిగ్గు తేల్చారు. ఈ పరిస్థితుల్లో కట్ట కూలటానికి కారణమైన వారితో ఇరిగేషన్ ఉన్నతాధికారి సంప్రదింపులు జరపటం ఏమిటో అంతుచిక్కడం లేదు. సీఈ రాసిన ఉత్తరానికి క్వారీ యాజమాన్యం ఇచ్చిన సమాధానం మరింత విస్తుగొలిపేలా ఉంది. కాలువ ప్రవాహ మార్గాన్ని మార్చి నూతన మార్గానికి అవసరమైన భూమిని సేకరించి తమకు అప్పగించటంతో పాటు కూలిన ప్రాంతాన్ని తమకు ఇస్తే తామే కట్ట పునరుద్ధరిస్తామని తాపీగా సమాధానం ఇచ్చింది. కాలువ మార్గాన్ని మార్చటానికి ఎటువంటి అవకాశం లేని పరిస్థితి ఇక్కడ ఉంది. కాలువకు ఇరువైపులా గ్రానైట్ పరిశ్రమ విస్తరించి ఉంది. వారి భూముల నుంచి కాలువ వెళ్లటానికి ఒప్పుకొనే పరిస్థితి లేదు. ఇక్కడి పరిస్థితులను వాకబు చేయకుండా ఏకపక్షంగా క్వారీ యాజమాన్యం ప్రతిపాదించిన ప్రతిపాదనకు ఏకీభవించిన సదరు అధికారి దానిని రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారు. తదనుగుణంగా ఇరిగేషన్ సెక్రటరీ సీఈ ఇచ్చిన నివేదిక మేరకు తాము తిరిగి ఆదేశాలు ఇచ్చే వరకూ కట్ట పునరుద్ధరణపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఉత్తర్వులు జిల్లా అధికారులకు జారీచేశారు. దీంతో కారుమంచి కథకంచికి చేరింది. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కృషి, ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్, జిల్లా ఇరిగేషన్ అధికారుల సానుకూలతలు అన్ని బుగ్గిపాలయ్యాయి.



క్వారీలో విరిగిపడిన కారుమంచి మేజర్ కాలువ

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద కోరారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వీఆర్ఏలకు పేస్కేలును అమలు చేయడంతోపాటు నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులైన వారందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాల వంటి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా సంఘం నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆయా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొండలరావు, వేణు, నరసింహరావు, సామేలు, పవన్, శ్రావణి, శారద, సుజాత తదితరులు ఉన్నారు.

గుండ్లకమ్మ పదిగేట్లు ఎత్తివేత



గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

మద్దిపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి సోమవారం 25వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. 10 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కారణంగా ప్రాజెక్టులోకి నీరు చేరుతోంది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లు పంపుతున్నామని, వరద ఉధృతి పెరిగితే మరో గేటు ఎత్తే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదు

● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐ బీఎస్‌పీ ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. సోమవారం డివిజనల్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందుకు సంబంధించి సంబంధిత అధికారికి అక్కడికక్కడే సిఫారసు చేశారు. అర్జీల విచారణలో పారదర్శకత పాటించాలని, ప్రతి నిరుపేదకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. అలాగే ఏఐ బీఎస్పీ ప్రతినిధులు గాంధీనగర్‌లో యానాది కాలనీ వాసులకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన అర్జీను స్వీకరించి ప్రతినిధులతో మాట్లాడారు. కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ



మొక్కల పంపిణీ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత ఎల్ఐసీ కార్యాలయం ఆవరణంలో ఉచితంగా మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేప, రాగి, జామ, చింత, గోరంటాకు, రావి నేరేడు, పూలమొక్కలను పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు బాచిన పూర్ణచంద్రరరావు తెలిపారు. దాదాపు 500 మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, లేవీ ప్రసాద్, అంజాద్ బాషా, మహమ్మద్ రఫీ, రామకోటేశ్వరరావు, లక్ష్మిరెడ్డి, దేవపాలన, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● సీడీపీవో ఎలిజబెత్‌రాణి



చిన్నారికి అన్నప్రాసన చేయిస్తున్న సీడీపీవో ఎలిజబెత్‌రాణి

పంగులూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోషకారంతో సంపూర్ణఆరోగ్యం లభిస్తుందని కొరిశపాడు సీడీపీవో ఎలిజబెత్‌రాణి అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ రాగులు, సజ్జలు, జొన్నలు, కూరగాయలు ఆహారంలో తీసుకోవాలన్నారు. తల్లిపాలతోపాటు రాగిజావలాంటి పదార్థాలు పిల్లలకు శక్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, సుజాత, శ్యామల, ప్రసన్నకుమారి, సుధారాణి, ఏఎన్ఎం రామాంజమ్మ, గర్భిణులు, బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

యద్దనపూడి,(మార్టూరు)సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ యద్దనపూడి మండల నూతన కమిటీ ఎంపిక సోమవారం యద్దనపూడిలో నిర్వహించారు. కమిటీ కన్వీనర్‌గా దారా బాబూరావు, కో-కన్వీనర్‌గా టి.జ్యోత్స్న, కమిటి సభ్యులుగా ఎస్‌కె కరిముల్లా, టి.అశోక్ కుమార్, ఎస్‌కే.సత్యా, పి కుమార్, టి రమాదేవి, తదితరులను ఎంపికచేశారు. కార్యక్రమాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆన్‌లైన్ అమ్మ'కం..బాదుడు'!

(5వ పేజీ తరువాయి)

70 మంది ఈ-కామర్స్ సంస్థల ద్వారానే వస్తువులు కొనుక్కుంటున్నారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వీరందరి నుంచి ఈ సంస్థలు వివిధ రూపాల్లో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయి.

రకరకాల ఫీజుల మోత..!

ఒక ఈ-కామర్స్ సంస్థ తన వెబ్‌సైటును వినియోగించుకున్నందుకు ప్లాట్‌ఫాం ఫీజు కింద రూ.5 నుంచి రూ.15, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ఫీజు పేరుతో రూ.49 నుంచి రూ.59 వసూలు చేస్తోంది. అలాగని ఆర్డర్ పెట్టిన వస్తువు రాకపోతే మాత్రం సంస్థ బాధ్యత తీసుకోవడం లేదు. వీటితోపాటు ఆఫర్ హోల్డింగ్ ఫీజు పేరుతో రూ.149, ఎక్స్‌చేంజ్ ఆఫర్ కింద పికప్ చార్జీ పేరుతో రూ.99 నుంచి రూ.199 వరకూ వసూలు చేస్తోంది. తాజాగా మరో సంస్థ కూడా ఇదే తరహాలో ఫీజుల వసూలు మొదలు పెట్టింది.

● వస్తువు రాకుంటే ఫీజులు గల్లంతే..!

ఇంత ఖర్చు చేసి ఒక వస్తువును ఆర్డర్ చేస్తే అది వినియోగదారుడి చేతికి అందితే అదృష్టమే. అందలేదంటే ఆ ఫీజులు మొత్తం పోయినట్లే లెక్క! ఆర్డర్ చేసిన తర్వాత ఆ వస్తువు అమ్మకందారు పంపించకపోయినా, అతడే ఆర్డర్ క్యాన్సిల్ చేసినా సరే.. అదనంగా చెల్లించిన ఫీజులు తిరిగి రావు. కేవలం వస్తువు ఖరీదు మాత్రమే వస్తోంది. దీంతో వినియోగదారులు అనేక మంది లబోదిబోమంటున్నారు. సేవలను అందించామనే పేరుతో ఈ కామర్స్ సంస్థలు ఫీజులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఫిర్యాదులు వేల సంఖ్యలో వస్తున్నాయి.

● రిటర్న్ విండో మూసివేత..

ఈ-కామర్స్ సంస్థలు క్రమంగా రిటర్న్ విండోను మూసేస్తున్నాయి. తొలినాళ్లలో నెల రోజులపాటు రిటర్న్ ఆప్షన్ అందు బాటులో ఉండేది. ఈ సమయంలో ప్రొడక్టుకు ఏదైనా సమస్య వస్తే తిరిగి పంపించే అవకాశం ఉండేది. తిరిగి కొత్త ప్రొడక్టును గానీ, లేదా చెల్లించిన మొత్తాన్ని కానీ రీఫండ్ చేసేవారు. తర్వాత ఈ సమయాన్ని పక్షం, వారం రోజులకు కుదించారు. ఇప్పుడైతే పూర్తిగా ఆ ఆప్షన్‌ను ఎత్తేశారు. రీప్లేస్‌మెంట్ అవకాశాన్ని మాత్రమే ఇస్తున్నారు. ఇందులో కూడా సర్వీస్ సెంటర్ రీప్లేస్‌మెంటు ఆప్షన్‌ను మాత్రమే ఎక్కువగా ఇస్తున్నారు. అంటే వస్తువు ఒకసారి వినియోగదారుడి చేతికి చేరిదంటే ఆ వస్తువుతో ఈ-కామర్స్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నమాట! ఆ వస్తువును తీసుకుని సంబంధిత కంపెనీ సర్వీస్ సెంటర్ చుట్టూ తిరగాల్సిందే! అథరైజ్డ్ సెల్లర్ దగ్గర తీసుకున్న ప్రొడక్టు అయితేనే సర్వీస్ సెంటర్ సేవలు అందిస్తుంది. థర్డ్ పార్టీ సెల్లర్ దగ్గర తీసుకుంటే మాత్రం ఇక అంతే సంగతులు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండడం ఎంతైనా అవసరం.

సేంద్రియ కూరగాయలతోనే ఆరోగ్యం

పొన్నలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో సోమవారం సేంద్రియ కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా వ్యవసాయ అధికారి వడ్డే రాము మాట్లాడుతూ కుటుంబ ఆరోగ్యం ఇంటి ఇల్లాలిపై ఆధారపడి ఉంటుందని ప్రతి ఒక్కరూ చిన్న స్థలాల్లోనే సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు పండించి తమకు అవసరమైనవి సమకూర్చడంతో పాటు ఆదాయం కూడా పొందవచ్చునని, మహిళలు ఇంటి వద్ద సేంద్రియ కూరగాయలు పండించుకోవచ్చని తెలిపారు. సేంద్రియ కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మందాకిని, జ్యోత్స్న, విజయలక్ష్మి, నాగరాజు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పి హర్షవర్ధన్ రాజు

పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

పొన్నలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్టేషన్ సమస్యలపై ఆరా తీశారు. సర్కిల్ పరిధిలో వివిధ కేసుల వివరాలు, ఇతర సమస్యలపై పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ట్రాఫిక్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పలు సూచనలు చేశారు. మండలంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

వర్షాల నేపథ్యంలో బీచ్ ఫెస్టివల్ రద్దు

భారీ వర్షాల సూచనతో నిర్ణయం



సూర్యలంక తీరంలో పర్యటిస్తున్న ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, కలెక్టర్ వినోద్‌కుమార్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : సూర్యలంక తీరంలో ఈ నెల 26, 27, 28వ తేదీలలో నిర్వహించ తలపెట్టిన బీచ్ ఫెస్టివల్‌ను రద్దు చేస్తున్నట్లు టూరిజం విభాగం జిల్లా అధికారి నాగిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు కూడా బీచ్ పండుగకు హాజరవుతారని గతంలోనే యంత్రాంగం ప్రకటించింది. అందుకు తగ్గట్లే ఏర్పాట్లను కూడా ప్రారంభించారు. అయితే ఈ వారంలో అల్పపీడనాల ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచనల నేపథ్యంలో ఫెస్టివల్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బీచ్ ఫెస్టివల్ నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి సోమవారం సూర్యలంక తీరానికి వచ్చారు. ఈ నెల 26, 27వ తేదీల్లో వాతావరణ పరిస్థితులపై చర్చించారు. ప్రతికూల పరిస్థితుల్లో బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయడం కష్టమేననే అభిప్రాయాన్ని ఎండీ ముందు జిల్లా యంత్రాంగం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇవే అంశాలను ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా బీచ్ ఫెస్టివల్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. త్వరలో వేరే తేదీల్లో బీచ్ పండుగను నిర్వహిస్తామని పర్యాటకశాఖ తెలిపింది.

ఆదమరిస్తే అంతే సంగతులు

ముక్తేశ్వరం- రామాంజనేయపురం మధ్య పొంచి ఉన్న ప్రమాదం

బల్లికురవ, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముక్తేశ్వరం రామాంజనేయపురం గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డులో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ రోడ్డులోని మేజర్ కాలువపై గతంలో కురిసిన వర్షాలతో పెద్ద గుంత ఏర్పడింది. ఈ రోడ్డులో ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే మలుపు అంచులలోని గుంత వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. వేగంగా వచ్చే వారు కాలువలోకి పడి పోతున్నారు. దీంతో రైతులు గుంత ఉన్న కాలువ వద్ద ముళ్ల కంప వేశారు. రైతులు నిత్యం ఈ రోడ్డులో ప్రయాణం చేయటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డులో ఉన్న గుంతలను పూడ్చించాలని రైతులు కోరుతున్నారు.



గుంత వద్ద ముళ్ల కంప పెట్టిన ప్రజలు



ముక్తేశ్వరం రామాంజనేయపురం రోడ్డులో కాలువ వద్ద గుంత

జీఎస్టీ తగ్గింపుతో బీజేపీ సంబరాలు



టపాసులు పేల్చి సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు సోమవారం నుంచి అమలులోకి రావడంతో భారతీయ జనతా పార్టీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ కాంప్లెక్స్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ సోమవారం నుంచి అమలులోకి వచ్చిన వస్తు సేవల పన్ను-2 వల్ల అనేక వస్తువుల ధరలు తగ్గాయన్నారు. 395 రకాల వస్తువుల ధరలు భారీగా తగ్గించడం వల్ల మధ్యతరగతి ప్రజలు, వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, నాయకులు మాకినేని నరసింహం, సీతారామయ్య, బి. విజయారావు, శ్రీలక్ష్మి, జిల్లెళ్ళమూడి రమాదేవి, రాజేష్ వర్మ, మోజేష్, రాధాకృష్ణ, సత్యనారాయణ, గుర్రం రంగనాథ్, కొమ్ము శ్రీనివాసరావు, రవీంద్ర తదితరులు ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఒడా చైర్మన్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :ఎస్పీ హర్షవర్ధన్‌రాజును జనసేనపార్టీ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు, ఒడా చైర్మన్ షేక్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం హర్షవర్ధన్‌రాజును కలిసి శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. అదే విధంగా రవిశంకర్ గ్రూపు అధినేత, జనసేనపార్టీ నాయకులు కంది రవిశంకర్, ఒంగోలు మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ చిట్టెం ప్రసాద్‌లు ఎస్పీని కలిసి శాలువతో సత్కరించారు.



ఎస్పీ హర్షవర్ధన్ రాజును సన్మానిస్తున్న ఒడా చైర్మన్ రియాజ్

శనగల నిల్వలను కొనుగోలు చేయాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా లో రైతుల వద్ద నిల్వలు ఉన్న శనగలను పదివేల రూపాయలకు కొనాలని లేకుంటే మూడు వేలరూపాయలు బోనస్ ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు, కిసాన్ సంయుక్త మోర్చ నాయకులు హనుమారెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఉప్పుగుండూరు మార్కెట్ యార్డులో కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో శనగ రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా జిల్లాలో అత్యధికంగా శనగ పంట సాగు చేశారని, ధర లేకపోవడంతో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేశారని అన్నారు. ప్రస్తుతం ధర దిగజారి నందున కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ ఉన్న శనగలను పది వేలకు కొనాలని లేదా మూడు వేలు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని తీర్మానించారు.

అవీ..ఇవీ..

నిషేధిత జాబితా నుంచి విముక్తి

అద్దంకి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):అద్దంకిపట్టణంలోని ఉత్తర అద్దంకి 1038 సర్వే నంబరులో దేవాలయాల స్థలాలు పోను మిగిలిన భూమిని సబ్‌డివిజన్ చేసి నిషేధిత జాబితా నుండి తొలగించినట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. ఆరు దేవాలయాలకు సంబంధించిన స్థలాలను సబ్ డివిజన్ చేసి మిగిలిన విస్తీర్ణంలో క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్‌కు వీలు కల్పిస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు పంపినట్లు తెలిపారు. కొంతకాలంగా నిలిచిపోయిన క్రయ, వి క్రయాల రిజిస్ట్రేషన్లకు అడ్డంకులు తొలగిపోయాయి.

నేడు మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం

అద్దంకి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే కార్మికులకు స్వచ్ఛత హీ సేవా-2025 కార్య క్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు అన్ని రంగాలపై అవగాహన అవసరం



పుస్తకాలను అందజేస్తున్న హెచ్ఎం గంగాధర్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాలపై అవగాహన కలిగి ఉండాలని హెచ్ఎం పి.గంగాధరరావు అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రారంభం అవుతున్న ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలను హెచ్ఎం అందజేశారు. ఈ క్రమంలో మూడు గ్రూప్‌ల విద్యార్థులు అద్దంకి పట్టణంలోని పలు దుకాణాల వద్ద అవగాహన కల్పించి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకోవాలి



ప్రత్యామ్నాయ పంటల బ్రోచరును ఆవిష్కరిస్తున్న విజయనిర్మల

మార్టూరు, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలని ఆత్మ డీపీడీ కే.విజయనిర్మల అన్నారు. సోమవారం మార్టూరులో వ్యవసాయమార్కెట్ యార్డులో ప్రకాశం జిల్లా ఆత్మ వారి సౌజన్యంతో మార్టూరు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కోసం రైతులతో కిసాన్ గోష్టి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏవో లావణ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయనిర్మల రైతులకు పొలంబడి, విజ్ఞానయాత్రలు, ప్రదర్శనా క్షేత్రాలు, రైతులకు శిక్షణ కార్యక్రమాలను గురించి వివరించారు. అనంతరం మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ జి రమేష్ మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, రబీ కాలంలో సోయా చిక్కుడు, మినుము, శనగ పంటలను సాగుచేయాలన్నారు. తరువాత లాం శాస్త్రవేత్త ఉమాదేవి మాట్లాడుతూ మార్కెట్ ధరలకు అనుగుణంగా పంటల సాగు చేయాలన్నారు. అనంతరం ఏడీఏ సుదర్శనరాజు మాట్లాడుతూ యూరియా అధిక వినియోగాన్ని తగ్గించాలన్నారు. అనంతరం మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు అధికారులు అందరూ సహకరించాలన్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ వెలగా రామాంజనేయులు మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులను ఇవ్వాలన్నారు. తదనంతరం ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన బ్రోచర్లను అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మాధవీలత, ఉద్యానశాఖ అధికారి హనుమంత నాయక్, రైతుసంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి, పెంట్యాల శరత్, రాజశేఖర్, ఏఈవో రాధాకృష్ణ, అక్షర, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

చినగంజాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 24వ తేదీ నుండి అక్టోబరు 2వ తేది వరకు కడవకుదురు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో సీజన్-2 రెడ్ టెన్నిస్ బాల్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టోర్నమెంట్‌లో విజేతలైన టీంకు మొదటి బహుమతి రూ.25,000లు, రెండవ బహుమతి రూ.20,000లు, మూడవ బహుమతి రూ.15,000లు, నాలుగవ బహుమతి రూ.10,000లు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు శ్యామ్ సెల్ నెంబరు 86883 69827, హర్ష సెల్ నెంబరు 9390012789లను సంప్రదించాలన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్యామల

మార్టూరు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల వయస్సులోపు పిల్లల మెదడుపై ప్రభావం చూపే విధంగా పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు అందించే విధంగా అవగాహన కలిగి ఉండాలని సూపర్‌వైజర్ శిరీష పేర్కొన్నారు. సోమవారం మార్టూరులో మద్దిసీతాదేవినగర్‌లో అంగనవాడీ కేంద్రంలో పిల్లలు తల్లులు, అంగనవాడీ కార్యకర్తలతో శిరీష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్లీ చైల్డ్ కేర్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్త అంజలి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మార్టూరులో నేతాజీనగర్, రామ్‌నగర్‌లో అంగనవాడీ కార్యకర్తలు రాజ్యం, అరుణ, సుశీలల ఆధ్వర్యంలో పిల్లల తల్లులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సుగాలి కాలనీలో కార్యకర్త రాజేశ్వరి, కిషోర్ కాలనీలో శ్యామల,ముస్లిం కాలనీలో దయమ్మల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఇంకా మార్టూరులోని మిగిలిన అంగనవాడీ కేంద్రాలలో కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

సంతమాగులూరు, సెప్టెంబర్ 22, (ఆంధ్రజ్యోతి) మండలంలోని వేల్చూరు గ్రామపంచాయతీలోని రామిరెడ్డిపాలెంలో 8వ రాష్ట్రీయ పోషణ వార్షికోత్సవం సీడీపీవో సుధారాణి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ జి.ప్రమీల అధ్యక్షతన నిర్వహించారు. పోషణ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం బొమ్మల కొలువులో భాగంగా పేరెంట్స్ ను ఆహ్వానించి, వర్ణమాల బొమ్మల కొలువులు "అ నుండి ఱ వరకు"ప్రతి అక్షరానికి సంబంధించిన చిత్రాలను చూపించారు. వాళ్ల పిల్లల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తిరుమల, ఇందిరా, చిన్నమ్మ, దుర్గ, బసవమ్మ, బోడెమ్మ పద్మ, షకీరా, అపర్ణ, మస్తానమ్మ, మస్తాన్‌బీ, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

స్మార్టుకార్డులతో బహుళ ప్రయోజనాలు

- మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్
- సమస్యలపై సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం

అద్దంకి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌కార్డులతో లబ్ధిదారులకు బహుళ ప్రయోజనాలున్నాయని, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం అద్దంకిలో పలువురు లబ్ధిదారులకు కార్డులను అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి రేషన్ కార్డులపై కూడా తన ఫొటో ముద్రించుకున్నాడన్నారు. ప్రస్తుతం స్మార్ట్‌కార్డుల ద్వారా మెరుగైన సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో రోడ్డు ప్రమాదాల జరగకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ ఉదయం, సాయంత్రం సమయంలో నామ్ రోడ్డు లో ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను ఉంచాలన్నారు. త్వరలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడతా మన్నారు. దీని ద్వారా కొంత మేర ట్రాఫిక్ మరల్చ వచ్చన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న పాత భవనాలను వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ రవీంద్రకు మంత్రి రవికుమార్ సూచించారు. పలువురి నుంచి వచ్చిన అర్జీలను తీసుకున్నారు. కార్యక్రమాలలో తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఆర్ఐ శంకర్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సుభాషిణి లహరి, అత్తులూరి రమేష్ పాల్గొన్నారు.

అద్దంకి: వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సచివా లయ ఉద్యోగులకు తక్కువ జీతాలు ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జీతాలు పెంచిం దని సాంఘిక సంక్షేమ శాఖ మం త్రి డీవీబీ స్వామి అన్నారు. అద్దంకిలో పలు కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వచ్చిన మంత్రులు స్వామి, రవికుమార్లకు వేర్వేరుగా సచివాలయ ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భం గా పనిభారం తగ్గించాలని, ఇంటింటి సర్వేలు లేకుండా చేయాలని సచివాలయ ఉద్యోగులు మంత్రి స్వామిని కోరగా స్పందించిన మంత్రి ఇంటింటి సర్వే సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. గతంలో ఒక పంచాయతీ కార్యదర్శి చేసే పనికి ప్రస్తుతం 8 మంది సచివాలయ సిబ్బంది పనిచేస్తున్నందున పని విభజన చేసుకొని ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు చేరే విధంగా చూడాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు.



స్మార్ట్‌కార్డులను అందజేస్తున్న మంత్రి రవికుమార్

రోడ్డు అంచులు లేకపోవడంతో పొంచి ఉన్న ప్రమాదం

మేదరమెట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కొరిశపాడులో సిమెంట్ రోడ్డుకు అంచులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి రావినూతల వరకు రహదారులు భవనాల శాఖ అధ్వర్యంలో రోడ్డు నిర్మించారు. హైవే నుంచి కొరిశపాడు చెరువు వరకు సిమెంట్ రోడ్డు నిర్మించారు. సిమెంట్ రోడ్డు నిర్మిణ సమయంలో రోడ్డు అంచులు సక్రమంగా నిర్మించలేదు. దీంతో సిమెంట్ రోడ్డుకు ఉత్తరం వైపున పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. కొత్త వ్యక్తులు ఎవరైనా ఈ రోడ్డు వెంబడి ప్రయాణం చేసేటప్పుడు అంచులు అర్థంకాక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఒకసారి కట్టెల ట్రాక్టర్ బోల్తాపడడంతో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ఇదే దారిలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు మండల కార్యాలయానికి, ప్రాథమిక ఆ రోగ్య కేంద్రానికి , పశువుల ఆస్పత్రికి వచ్చే ప్రజలు ఎదురు వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బంది పడుతున్నారు. కొరిశపాడు నుండి కుర్రావానిపాలెం మీదగా రావినూతల వెళ్లే వారు కూడా ఈ రోడ్డునే ప్రయాణిస్తుంటారు. రహదారులు భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి సిమెంట్ రోడ్డుకు రెండు వైపులా గ్రావెల్‌తో అంచులను వేయాలని కొరిశపాడు గ్రామస్థులతో పాటు మండల ప్రజలు కోరుతున్నారు.



అంచులేని సిమెంట్ రోడ్డు

ఆక్వా సాగు చేసే ప్రతి రైతు లైసెన్స్ తీసుకోవాలి

చినగంజాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఆక్వా సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని కారంచేడు మత్స్యశాఖభివృద్ధి అధికారి ఎం.రవీంద్ర సోమవారం తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఆక్వాసాగు, ఆక్వా బిజినెస్ ఆపరేషన్స్ చేపల, రొయ్యల చెరువులను క్రమబద్ధీకరణ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్-2020ను తీసుకొని వచ్చిందన్నారు. ఈ యాక్ట్ కింద చెరువులను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఇప్పటి వరకు లైసెన్స్ లేకపోవడం, లైసెన్స్ ఉండి రెన్యువల్ చేయలేకపోతే రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్-2020, కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. ఆక్వా రైతులు లైసెన్స్ లేని వారు, రెన్యువల్ చేయని వారందరూ ఆయా గ్రామాల మత్స్య సహాయకులను సంప్రదించాలన్నారు. పెదగంజాం గ్రామమత్స్య సహాయకులు ఎస్‌కే.కాలేషా సెల్ నెంబరు.9494630542, మోటుపల్లి గ్రామానికి డి.రామారావు సెల్ నెంబరు.6281738228, చినగంజాం, కొత్తపాలెం గ్రామాలకు సీ.హెచ్.డార్విన్ సెల్ నెంబరు 9441996257, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం గ్రామాలకు పి.సుబ్రహ్మణ్యం సెల్ నెంబరు 9963228864లను సంప్రదించాలన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- పర్చూరు సెంటర్‌లో తక్కువ ధరకు ఉల్లిపాయల విక్రయం



ప్రజలకు ఉల్లిపాయలను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు

పర్చూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. సోమవారం ఏఎంసీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉల్లి రైతులకు సరైన మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిన ఉల్లిపాయలను కేజీ రూ. 11 చొప్పున స్థానిక బొమ్మల సెంటర్‌లో ఏఎంసీ చైర్మన్ పంపిణీ చేశారు. ఉల్లిపాయలు తక్కువ ధరకు అమ్మకాలు చేయడంతో ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా.., ప్రభుత్వం ముందుండి వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. పొగాకు, కొబ్బరి, మామిడి పంటలకు గిట్టుబాటు లేకున్నా, వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసి వారిని ఆదుకోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డెరెక్టర్ షేక్ షంషుద్దీన్ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగునీరు ముందుకెళ్లేలా కాలువ తవ్వకం

బల్లికురవ, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం బల్లికురవలో చిన్నపాటి వర్షం కురిసినా, వర్షపు నీరు పల్లంలో ఉన్న తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలోని పెద్దఎత్తున చేరుతోంది. కార్యాయాల ముందు ఉన్న మురుగు కాలు వలో మురుగు పేరుకపోయింది. దీంతో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో కార్యాలయాలలోకి నీరు వెళ్లింది. తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారిలు కార్యాలయంలోని నీరు బయటకు వచ్చేలా కాలువ తవ్వించారు. రోడ్డు అంచులోని చిరు దుకాణాల వారిని వెంటనే ఖాళీ చేయించి కాలువ పనులు చేయిస్తున్నారు. గతంలో ఉన్న కాలువను పైపులను తీయించి మురుగు నీరు వాగులోకి వెళ్లేలా పనులు చేయిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలువ పనులు చేయిస్తున్నామని అధికారులు తెలిపారు. రోడ్డు వెంబడి దుకాణాలు నిర్వహించుకొనేవారు కాలువలను పూడిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



మురుగునీరు బయటకు వెళ్లేలా కాలువ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

క్రమశిక్షణకు మారుపేరు డోలా కుటుంబం

అద్దంకి, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు డోలా కుటుంబం అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ సభ్యులు తక్కువ మంది ఉన్నా అసెంబ్లీలో వైసీపీ సభ్యుల అరాచకాలను ఎదురొడ్డి నిలబడడంలో స్వామి ముందున్నారన్నారు. అదే కుటుంబానికి చెందిన ఆయన సోదరి పద్మావతి హెచ్ఎంగా పనిచేస్తూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారన్నారు. అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న డోలా సువర్ణ పద్మావతి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా 36 సంవత్సరాల పాటు స్కూల్ అసిస్టెంట్‌గా, ప్రధానోపాధ్యాయురాలిగా ఆమె చేసిన సేవలను పలువురు కొనియాడారు. మంత్రి స్వామి మాట్లాడుతూ తన సోదరి పద్మావతి క్రమశిక్షణ, నిజాయితీగా పనిచేయటం ద్వారా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారన్నారు. మంత్రులు రవికుమార్, స్వామిలు పద్మావతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రకాశం డీఈవో కిరణ్‌కుమార్, చీరాల డిప్యూటి ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గంగాధరరావు, ఎంఈవో కేవీ శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ, ఒంగోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కళ్యాణి, ప్రకాశం జిల్లా డీసీఈబీ కార్యదర్శి మ ర్రి శ్రీనివాసరావు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చిలుకూరి గోపీ, వెంకటరావు, వేణుగోపాల్, కౌన్సిలర్ సుభాషిణి, లహరి తదితరులు పాల్గొన్నారు.



డోలా సువర్ణ పద్మావతిని సన్మానిస్తున్న మంత్రులు

రాహుల్‌గాంధీ పిలుపుమేరకు సంతకాల సేకరణ

పర్చూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో జరుగుతున్న ఓట్ల చోరీ జరుగుతోందని, కేంద్ర ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పర్చూరులో సంతకాల సేకరణ నిర్వహించారు.. ఈ సందర్భం గా నియోజకవర్గ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లగొర్ల శివలక్ష్మీజ్యోతి ఆధ్వర్యంలో రోటరీ భవనంలో 'ఓట్ చోర్ గద్దె చోడ్' కార్యక్రమంలో భాగంగా సంతకాలు సేకరించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి మాట్లాడుతు రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.



సంతకాల సేకరిస్తున్న నేతలు

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- బాలాత్రిపురసుందరిగా అమ్మవారు దర్శనం
- అద్దంకిలో గుండ్లకమ్మ నుంచి జలాలు తెచ్చిన మహిళలు

అద్దంకి, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అద్దంకి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం, వేయిస్తంభాల గుడి, దత్తపాదుకా క్షేత్రం తదితర దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. ఉదయం గుండ్లకమ్మనది నుంచి 108 కలశాలతో మహిళలు జలం తీసుకొని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు. రాత్రి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ పూటుకూరి రామకోటేశ్వరరావు, ఉమాఅన్నపూర్ణ దంపతులు, పూజారి స్వర్ణ వెంకటసుబ్బారావు, గార్లపాటి శ్రీనివాసరావు, చిన్ని శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్ పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో సోమవారం నుంచి భక్తిశ్రద్ధలతో దసరా శరన్నవరాత్రి పూజమహోత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు ప్రతి ఇంట్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించారు. మండలంలోని కొప్పెరపాడు బొడ్డురాయి కూడలిలో దుర్గాదేవి విగ్రహాన్ని భక్తులు సమష్టిగా పూజలు చేశారు. ఈసందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

మార్టూరు : దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి మండలంలోని అ మ్మవారి దేవాలయాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని వివిధ రూపాలలో, వివిధ దేవాలయాల్లో అలంకరించారు. మార్టూరులో బొడ్డురాయి కూడలి వద్ద ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మ వారిని కన్యకాపరమేశ్వరి అవతారంలో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీదుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని బాల త్రిపురసుందరి అవతారంలో అలంకరించారు. మండలంలోని జొన్నతాళి గ్రామంలో ప్రత్యేకంగా హైదరాబాదు నుంచి తీసుకొచ్చిన అమ్మవారి విగ్రహానికి మహాచండీ దేవి అవతారంలో అలంకరించారు. ద్రోణాదుల గ్రామంలో శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మ వారిని తొలి రోజు బాల త్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వలపర్ల గ్రామంలో అమ్మ వారి దేవాలయంలో భక్తులకు బాల త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు.

మేదరమెట్ల : దసర శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తొలిరోజున అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. దైవాలరావూరులోని ఉమామహేశ్వర అ మ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. ఉదయం నుంచే అహిషేకాలు , ప్రత్యేక పూజలను ఆలయ పూజారి రాజశేఖరశర్మ నిర్వహించారు. మండలంలోని అన్ని దేవాలయాలల్లో అమ్మవారు ప్రత్యేక పూజలను అందుకున్నారు.. పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయాలకు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

చినగంజాం : మండల పరిధిలోని పలు దేవాలయాలలో విజయదశమి పర్వదినం సందర్భంగా శరన్నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభమ య్యాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. మందిరంలోని బతుకమ్మ అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోపిరాల గ్రామంలోని శ్రీలలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి వారి దేవస్థానంలోని లలితాదేవి అమ్మవారిని, భవానీపురంలోని కనకదుర్గా భవాని అమ్మవారి దేవస్థానం లోని కనకదుర్గాభవాని అమ్మ వారిని శ్రీబాల త్రిపుర సుందరీదేవిగా, అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని పలు దేవాలయాలలోని అమ్మవార్లను పలు రకాల అలంకారాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమైనాయి. బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయంలోని శ్రీవారిని, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రికి అంకురారోపణ పూజలు జరిపారు. తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంగులూరు: మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోని శ్రీలక్ష్మీగణపతి షిర్డీసాయి ఆలయంలో శ్రీబాలత్రిపురసుందరీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనము, పంచగవ్యపూజ, శ్రీదేవీ నవావర్ణపూజ, మండప ఆరాధన, కలశస్థాపన, రుద్రాభిషేకము, శ్రీచక్రార్చన, శాంతిహోమం కార్యక్రమాలు ఆలయ అర్చకస్వామి సర్వేపల్లి దివ్యరూపాచారి శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు. కొండమూరులో కొండమూరమ్మ అమ్మవారి ఆలయప్రాంగణంలో అర్చకస్వామి కొండకావూరి శివయ్యశర్మ శాస్త్రోక్తంగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు. రామకూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీబాలత్రిపురసుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకస్వామి నూతలపాటి వెంకటేష్ నేతృత్వంలో పూజాకార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కలశాలతో జలం తీసుకొస్తున్న మహిళలు





అద్దంకి, బల్లికురవ, చినగంజాం, ముప్పవరంలో బాలాత్రిపురసుందరిదేవిగా అమ్మవారు





మార్టూరులో మహాచండీ అవతరంలో అమ్మవారు, కన్యకాపరమేశ్వరిగా వాసవీమాత

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

మంగళవారం 23 సెప్టెంబరు 2025



నెల్లూరులోని మూలాపేటేశ్వరుడి ఆలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థిని



రాపూరు : పెంచలకోనలో సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి



నెల్లూరు : రాజరాజేశ్వరిగా ఇరగాళమ్మ అమ్మవారు



నెల్లూరు : చండీ అలంకారంలో రాజరాజేశ్వరి



నెల్లూరు రూరల్ : వేదగిరిపై ఆదిలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు



సంగం : బాలత్రిపురసుందరిగా కామాక్షిదేవి

నవ దుర్గాయై నమః

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం

వివిధ అలంకారాల్లో జగన్మాత కనువిందు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. నవదుర్గల అలం కారాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చా రు. జైభవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నామస్మరణ ఆలయ పరిసరాల్లో మారుమోగింది. తొలిరోజు కలశ స్థాపనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. నెల్లూరులోని కన్యకాపరమేశ్వ రి ఆలయం ఆధ్వర్యంలో 1008 మంది సువాసినులు ఎర్రటి వస్త్రాలు ధరించి రంగనాథ స్వామి ఘాట్ నుంచి పెన్నానదీ జలాలు సేకరించారు. అనంతరం వెండి రథంలో కన్యకాపరమేశ్వరిరాగా మంగళవాయిద్యాలు, మేళతాళాలతో జైవాసవీ, జైజై వాసవీ అనే నామస్మరణలతో ఊరేగింపుగా కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకున్నారు. కలిశోత్సవంలో పాల్గొన్న ప్రతి మహిళకు కుబేర యంత్రాన్ని బహూకరించారు. రాజరాజేశ్వరి ఆలయంలో సంపుటీకరణ, చండీహోమాలు ప్రారంభమయ్యాయి. అలాగే జొన్నవాడ, పెంచలకోన, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కావలి కలుగోళమ్మలతోపాటు అన్నీ ఆలయాల్లో కలిశ స్థాపనలతో ఉత్సవాలు వైభవం గా ప్రారంభమయ్యాయి. భక్తులు తొలిరోజే ఆలయాలకు పోటెత్తారు.



రాజరాజేశ్వరి ఆలయంలో భక్తుల సందడి


వీఎస్‌యూ విద్యార్థికి రాష్ట్రపతి అవార్డు

వెంకటాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎం. పథ్వీరాజ్‌కు రాష్ట్రపతి అవార్డు దక్కడం యూనివర్సిటీకే గర్వకారణంగా ఉందని వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం పృథ్వీరాజ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 29న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పృథ్వీరాజ్ ఈ అవార్డును అందుకోనున్నాడని తెలిపారు. మూడేళ్లగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వీఎస్‌యూ విద్యార్థులకు వరుసగా రాష్ట్రపతి అవార్డులు లభిస్తుండడం విశేషమన్నారు. వీఎస్‌యూ పొందుతున్న ఈ అవార్డులు కేవలం వ్యక్తిగత కృషి ఫలితం మాత్రమే కాదని, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది మధ్య సమన్వయ ఫలితమేనన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే. సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



వలంటీర్ పృథ్వీరాజ్‌ను అభినందిస్తున్న వీసీ శ్రీనివాసరావు తదితరులు

జేసీగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (హరనాథపురం); సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మొగిలి వెంకటేశ్వర్లు సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తహసీల్దారుగా జిల్లాలో పనిచేసిన అనుభవం తనకు ఉందని అన్నారు. నిబంధనల మేరకు తాను పని చేస్తానని, దస్త్రాలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కస్తామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలు పాటిస్తూ జిల్లా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

కన్నకొడుకే గూడు లేకుండా చేశాడయ్యా!

- ఇంటిని అక్రమంగా రాయించుకున్నాడు!
- కలెక్టర్‌కు ఓ వృద్ధురాలి మొర
- న్యాయం చేస్తామని బాధితురాలికి హామీ



ఈ వృద్ధురాలి పేరు ఎం.రమాజ్యోతి. కావలిలోని అరటితోట ప్రాంత వాసి. తన కుమారుడు మోసం చేసి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని వాపోతూ సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌కు చేరుకుంది. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హిమాన్షు శుక్లా ఆ వృద్ధురాలి నుంచి తొలి అర్జీ అందుకున్నారు. నడవలేని స్థితిలో కలెక్టరేట్‌కు చేరుకుని రమాజ్యోతి వద్దకే కలెక్టర్ చేరుకుని ఆమె సాధక బాధకాలు విన్నారు. ఈ సందర్భంగా రమాజ్యోతి మాట్లాడుతూ తన కుమారుడు ఎం. శ్రీనివాసులు మోసం చేసి తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు కన్నీటి పర్యంతమైంది. తనకు అన్నం, నీరు కూడా ఇవ్వకుండా చేశాడని వాపోయింది. ఆ ఇంటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించి, తన ఇంటిని తనకు చెందేలా చేయాలని కలెక్టర్‌ను ఆ వృద్ధురాలు వేడుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల ద్వారా విచారించి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని అన్నారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

సోమశిల జలాశయానికి 37,212 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


అనంతసాగరం సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో హెచ్చు, తగ్గులుగా కొనసాగుతోంది. సోమవారం 35,847 క్యూసెక్కులు వస్తుండగా, డ్యాంలో నీటినిల్వ 72.250 టీఎంసీలకు చేరుకుంది. దిగువకు వదులుతున్న నీటి మోతాదును తగ్గించారు. మూడు గేట్ల ద్వారా 15,000, పవర్ టెన్నల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



ధర తగ్గింది.. కొన్నిచోట్లే!

పాత సరుకు పేరుతో పాత ధరే

- అమలులోకి జీఎస్టీ తగ్గుదల
- ఎలక్ట్రానిక్ బిల్లులున్న చోట మాత్రం అమలులోకి..
- అన్ని వర్గాల్లోనూ వెల్లివిరుస్తున్న ఆనందం



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ (వస్తు వినియోగ పన్ను) సంస్కరణల ప్రభావం జిల్లాలో ఇంకా పూర్తిస్థాయిలో కనిపించడం లేదు. అనేక వస్తువులపై జీఎస్టీ తగ్గినా ఆ ఫలితం సామాన్యులకు అందేందుకు కొంత సమయం పట్టేలా కనిపిస్తోంది. ప్రధానంగా నిత్యావసరాల విషయంలో ఈ పరిస్థితి ఉంది. అయితే, ఎలక్ట్రానిక్ బిల్లులు ఇస్తున్న సూపర్ మార్కెట్లలో మాత్రం నిత్యావసరాల ధరలు తగ్గాయి. ఇప్పటివరకూ కొన్ని రకాల నిత్యావసరాలపై 18 శాతం జీఎస్టీ, మరికొన్ని రకాల నిత్యావసరాలపై 12 శాతం జీఎస్టీ ఉండగా, అది సోమవారం నుంచి 5 శాతానికి తగ్గింది. అంటే ఇప్పటివరకూ అమ్ముతున్న ధరల్లో 13 శాతం ధర తగ్గాల్సి ఉన్నప్పటికీ సాధారణ దుకాణాల్లో పాత సరుకు పేరుతో పాత ధరనే కొనసాగిస్తున్నారు. తమ దగ్గర మరో పది రోజుల వరకూ సరుకు ఉంటుందని, పాత జీఎస్టీ ప్రకారం ఆ సరుకును కొన్నాం కాబట్టి తాము కూడా అదే ధరకు అమ్మకపోతే నష్టం వస్తుందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. అయితే పెద్ద సూపర్‌మార్కెట్లలో మాత్రం సోమవారం నుంచి జీఎస్టీ ధరలు తగ్గించారు. ఇక షాపింగ్ మాల్స్, ఎలక్ట్రానిక్ దుకాణాలు, బైకులు, కార్ల షోరూముల్లో తగ్గించిన జీఎస్టీ ధరలు అమల్లోకి వచ్చాయి. ఇక్కడ ఆది, సోమవారాలకు తేడా స్పష్టంగా కనిపించింది. పండుగ సీజన్ కావడంతో షాపింగ్ మాల్స్ కళకళలాడుతున్నాయి. కాగా తగ్గిన జీఎస్టీ ధరల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రతీ దుకాణం ముందు బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. కానీ నెల్లూరులో చాలా చోట్ల వ్యాపారులు బోర్డులు ఏర్పాటు చేయలేదు.



నెల్లూరులోని ఓ షోరూమ్ ముందు జీఎస్టీ తగ్గుదలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తగ్గిన సబ్బులు, బిస్కట్ల ధరలు

కొత్త జీఎస్టీ రేట్లతో వస్తువుల ధరలు తగ్గాయి. సబ్బులు, టూత్‌పేస్టులు, పాలు, డైరీ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఔషధాలు, ఆటోమొబైల్స్, వాషింగ్ పౌడర్లపై జీఎస్టీ తగ్గింది. చిన్నకార్లపై పన్ను కొంత తగ్గించగా, ఎలక్ట్రిక్ వాహనాలపై మరింత పన్ను రాయితీ అందింది. గృహోపకరణాల వంటి వాటిపై పన్ను తగ్గింది. ఉదాహరణకు సబ్బుల మీద ప్రస్తుతం 18 శాతం జీఎస్టీ ఉండగా 5 శాతానికి తగ్గింది. సింథాల్ సబ్బు ధర రూ.50గా ఉండగా, జీఎస్టీ తగ్గుదలతో రూ.45లకు చేరుకుంది. హమామ్ సబ్బు రూ.45 నుంచి 40లకు, 4 లైఫ్‌బాయ్ సబ్బుల ప్యాక్ ధర రూ.68 నుంచి 60కి తగ్గింది. 200 గ్రాముల హార్లిక్స్ ధర రూ.130 నుంచి 110లకు, 200 గ్రాముల కిసాన్ జామ్ ధర రూ.90 నుంచి 80లకు తగ్గింది. జీఎస్టీ తగ్గింపు ధరతో కూడిన కొత్త సబ్బులు మార్కెట్‌లోకి వచ్చాయి. ముఖ అందానికి వినియోగించే పౌడర్ల ధరలు కూడా తగ్గాయి. రూ.150 ఉన్న టాల్కం పౌడర్ డబ్బా 140కి తగ్గింది. స్నానానికి వినియోగించే షాంపుల ధర కూడా దిగి వచ్చింది. ఉదాహరణకు సన్ సిల్క్ షాంపు ఎంఆర్‌పీ రూ.469 ఉంటే జీఎస్టీ తగ్గింపునకు ముందు రూ.430లకు విక్రయించేవారు. సోమవారం రూ.419లకే ఇస్తున్నారు. డవ్ షాంపు 340 ఎంఎల్ ధర రూ.490 ఉంటే, రూ.435లకు తగ్గింది.

- చిన్నకార్లపై ఇప్పటివరకు 22 శాతం జీఎస్టీ ఉండగా, 18శాతానికి తగ్గింది. దీనివల్ల రూ.7లక్షల కారుపై సుమారు రూ.35వేల వరకు తగ్గింది. ఫ్రిజ్‌లపై 18 శాతం ఉన్న జీఎస్టీ 12శాతానికి తగ్గటంతో రూ.20వేల ఫ్రిజ్‌పై రూ.1200 వరకు తగ్గింది. రూ.10వేలు ఉన్న ఓవెన్‌పై రూ.600 తగ్గింది. వాషింగ్ మిషన్‌పై వున్న 18శాతం జీఎస్టీ 12 శాతానికి తగ్గటంతో రూ. 15వేల విలువైన వాషింగ్ మిషన్‌పై రూ.900 తగ్గింది. ఇంటి కొనుగోలు, నిర్మాణ దారులకు జీఎస్టీ ద్వారా భారీగా ప్రయోజనం కలగనుంది. వీటిపై 28 శాతంగా ఉన్న జీఎస్టీ 18శాతానికి తగ్గింది. దీంతో నిర్మాణ ఖర్చు తగ్గింది.

కొనుగోళ్లు పెరుగుతున్నాయ్!



జీఎస్టీ తగ్గింపును అమలు చేస్తున్నాం. ఇప్పటికే సబ్బులు, పౌడర్‌లు జీఎస్టీ తగ్గింపు ధరలతో వచ్చాయి. అయితే బిస్కట్లు తదితరాలపై ధర పెంచకుండా వాటి బరువు పెంచి బిస్కట్లు తయారై వస్తున్నాయి. దీంతో బరువు పెరిగిన బిస్కట్ జీఎస్టీ తగ్గిన ధరకే వస్తుంది. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రయోజనం ఏమీ లేదని కొందరు అనటం సరికాదు. జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగదారుకు వస్తువుల ధరలు తగ్గుతాయి. అమ్మకాలు పెరడం వల్ల వ్యాపారి కూడా ఆనందపడతాడు.

- వాకాటి శేఖర్, నెల్లూరు

ధరలు తగ్గడం మంచిదే



నిత్యావసర వస్తువుల ధరలు తగ్గితే మాలాంటి చిన్న వ్యాపారులకు ఎంతో మేలు. ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం శుభపరిణామం. నిత్యావసర ధరలు అధికంగా ఉండడంతో హోటల్ నిర్వహణ ఖర్చు కూడా పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు ఖర్చులు తగ్గుతాయి.

- షేక్ సందానీ, ఉదయగిరి

బైక్ కొంటాను!



ఎప్పటినుంచో బైక్ కొనాలనుకుంటున్నా. కానీ జీఎస్టీ కారణంగా ధరలు అధికంగా ఉండడంతో కొనుగోలు చేయలేకపోయాను. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ధరలు తగ్గించడంతో కొత్త బైక్ కొనుగోలు చేస్తా.

- దారపనేని నారాయణ, సర్వరాబాదు, ఉదయగిరి

ఆర్థిక వెసులబాటు



కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గుముఖం పడితే మాలాంటి దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగినట్టు అవుతుంది. అయితే ప్రస్తుతం వస్తువుల రేట్లు పాత ధరలకే విక్రయిస్తున్నారు. జీఎస్టీ రేట్లు తగ్గింపు పూర్తిస్థాయిలో కొనసాగాలంటే కొన్ని రోజులు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో ఉన్న రేట్ల ప్రకారమే వస్తువులు అమ్ముతున్నారు.

- నాళం నారాయణరావు, కందుకూరు

- ఆంధ్రజ్యోతి బృందం



చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256

కోడిగుడ్ల ధర (100): 560

పరిశుభ్రతే లక్ష్యం

అల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలల ఆవరణలను పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ పరిసరాలను పరిశుభ్రం చేయడమే లక్ష్యంగా కొనసాగిస్తున్నట్టు ఆయన తెలిపారు. చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డీడీవో వరప్రసాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పరిసరాలు శుభ్రం చేయిస్తున్న కమిషనర్ ఉమామహేశ్వరరావు

అధ్యక్షా...

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, రైతులను ఆదుకోండి

● కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి



కావలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, ఆదుకోవాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనందున దళారులు ధాన్యం ధరలను పుట్టికి రూ.5,725 తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.19,725 ఉండగా రైతులు మార్కెట్‌లో రూ.14,000లకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అకాల వర్షాల వల్ల వరి పైరు నేలకొరగడంతో రైతులు మరింత నష్టపోతుండగా, దీనిని కూడా ఆసరాగా చేసుకుని దళారులు మరింత ధరలు తగ్గిస్తున్నారని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే దళారుల ఆదిపత్యం తగ్గి ధాన్యం ధరలను పెంచుతారని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు.

మహిళలకు ఉచిత వైద్యపరీక్షలు

అల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వొద్దు

కావలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈమేరకు సోమవారం కావలి ఆర్డీవో ఎం సన్నీవంశీక్రిష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సత్యవతమ్మ, జరుగుమల్లి విజయరత్నం, చౌటూరు లక్ష్మయ్య, జెడ్డా వాసు, ముక్కు మోహన్‌రావు, లక్ష్మీ నర్సు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా వై శంకర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సంతమాగులూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇటీవల వలేటివారిపాలెం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. పీఏ నరేంద్రదేవ్, కార్యాలయ సిబ్బంది శంకర్‌రావును సత్కరించారు.

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రుబీనా సూచించారు. మండలంలోని బంగారక్కపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాల సందర్భంగా సోమవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎన్‌ఎం విజయకుమారి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణపై అవగాహన

బిట్రగుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తాళ్ళూరులో కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు రామకృష్ణ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మాతాశిశు సంరక్షణపై సీహెచ్‌వో నజీమునీసా, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుప్రజ అవగాహన కల్పించారు. డాక్టర్ రామకృష్ణ ఆరోగ్య, అంగన్వాడి, ఆశా వర్కర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నాగులవరం పీఏసీఎస్ డైరెక్టర్ లక్కాకుల మాధవరావు, స్థానిక నేతలు శ్రీనివాసులు, జయరామయ్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు

బిట్రగుంట,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పలు సమస్యలపై ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

పొలాల్లో 'ప్రమాద' ఘంటికలు!

● నేలను తాకుతున్న విద్యుత్ తీగలు ● పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

గుడ్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు నేల కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్ తీగలు నేలను తాకుతున్నాయి. మండలంలోని జానకంపేటకు తూర్పున ఉన్న పొలాల్లో ఈ ప్రమాదకర పరిస్థితి నెలకొంది. అనేకసార్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినా, ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, జానకంపేట, చిన్నపవని, పరిసర గ్రామాల రైతులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూగజీవాలను మేత కోసం పొలాలకు తీసుకుపోవాలన్నా, గడ్డి కోసుకురావడానికి వెళ్లాలన్నా విద్యుత్ తీగలు నేలకు తాకుతుండడంతో ప్రాణాపాయం పొంచి ఉందన్నారు. గతంలో ఇక్కడ విద్యుత్ షాకుతో ఓ వ్యక్తి మృతి చెందాడని రైతులు తెలిపారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, తీగలను సరిచేయాలని లైన్‌మెన్‌కు ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, జానకంపేటలో నేలకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం


జానకంపేట పొలాల్లో నేలను తాకుతున్న కరెంట్ వైర్లు

పాడి రైతుల అభివృద్ధే ధ్యేయం

కావలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధే ధ్యేయం అని నెల్లూరు జిల్లా సంగం డెయిరీ జోనల్ మేనేజర్ వినోద్‌కుమార్ అన్నారు. కావలి మండలం రుద్రకోటలో సోమవారం పాడి రైతులకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినోద్‌కుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ డెయిరీ ద్వారా వచ్చిన ప్రతి రూపాయి రైతుకే చెందుతుందని, ప్రతి రైతు అభివృద్ధి చెందాలన్నదే ఆయన లక్ష్యం అన్నారు. మద్దూరుపాడు బ్రాంచ్ మేనేజర్ డి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంగం డెయిరీ పాడి రైతులకు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. అనంతరం రుద్రకోటలోని 52 మంది రైతులకు బోనస్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలసేకరణ కేంద్రం కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.


రైతులకు అందించిన బోనస్ చెక్కులు

వ్యక్తి మృతిపై కేసు నమోదు

కావలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరులో ఉంటున్న కొల్లిబోయిన దేవమణి (32) మృతిపై సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... గుడ్లూరు మండలం చినలాటరపి గ్రామానికి చెందిన దేవమణి ఏడాది క్రితం వచ్చి ముసునూరులో అద్దె ఇంట్లో ఉంటూ ఇళ్లకు నెంబర్లు వేసే పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో స్నేహితులైన నవీన్, ఆంజనేయులుతో కలసి 21వ తేదీ ఆదివారం తుమ్మలపెంట బీచ్‌కు వెళ్లి అక్కడ బాగా మద్యం సేవించాడు. తిరుగు ప్రయాణంలో మన్నంగిదిన్నె వద్ద దేవమణి బైక్ నడుపుతూ కిందపడిపోయాడు. దీంతో స్వల్పగాయాలతో మత్తులో ఉన్న దేవమణిని స్నేహితులు ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయారు. కాగా, తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో దేవమణికి ఫిట్స్ రావడంతో భార్య శ్రీవర్షిణి అతని స్నేహితులకు ఫోన్ చేసిచెప్పి వారితో కలసి ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లింది. వైద్యులు పరీక్షించి దేవమణి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుని తల్లి లక్ష్మమ్మ తమ కుమారుడి మృతిపై విచారించి న్యాయం చెయ్యాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి ఎస్‌ఐ తిరుమల రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మృతుడు దేవమణి

మహిళల ఆరోగ్యంతోనే ఆరోగ్య సమాజం

లింగసముద్రం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటిలో మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం, దేశం ఆరోగ్యంగా ఉంటుందని కందుకూరు డిప్యూటీ డిఎంహెచ్‌వో డా. పద్మజ పేర్కొన్నారు. సోమవారం లింగసముద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డా. పి రమేష్ అధ్యక్షతన జరిగిన 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలందరూ గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్ గురించి అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కొంతమంది మహిళలకు పోషకాహార కిట్లను అందజేశారు. వైద్య శిబిరంలో డా. తులసీరాం, డా. కళ్యాణ్‌కుమార్, డా. చంద్రశేఖర్, డా. నాగమణి, డా. విద్యావతి మహిళలకు బీపీ, షుగరు, హెచ్‌బీ, కంటి పరీక్షలు నిర్వహించారు. గర్భాశయ, ఎముకల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పి గురునాథం, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, జంపాల శివప్రసాద్, ఈ శ్రీనివాసులు, జనసేన సీనియర్ నాయకుడు కొట్టే వెంకటనారాయణ పాల్గొన్నారు.


పోషకాహార కిట్లను అందుకున్న మహిళలు

రోగులకు ఉచిత వైద్యపరీక్షలు

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : కరేడు పీహెచ్‌సీ పరిధిలోని కే రాజుపాలెంలో 'స్వస్థనారీ- సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. స్త్రీలకు వచ్చే రక రకాల క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్లను గుర్తించగలిగితే చికిత్స సులభతరం అవుతుందన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన సమతుల్యమైన ఆహారం, కాన్పుకు ముందు.. తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలకు సకాలంలో వేయించాల్సిన టీకాలు తదితర విషయాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కమ్యునిటీ హెల్త్ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సంగం డెయిరీ సేవలను వినియోగించుకోండి

గుడ్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ సేవలను పాడి రైతులు వినియోగించుకోవాలని జిల్లా సంగం డెయిరీ జోనల్ మేనేజన్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. పాజర్లలోని మూడు పాల సేకరణ కేంద్రాల పాడి రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పాల ఉత్పత్తులకు మరింత తోడ్పాటునిస్తు సంగం డెయిరీ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. డెయిరీ చైర్మెన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీ ద్వారా పాడి రైతులకు వచ్చే ఆదాయాన్ని సంబంధిత రైతులకు అందేలా పారదర్శకతతో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 2024- 25 సంవత్సరానికి గాను పాజర్లకు చెందిన 84 మంది రైతులకు రూ. 1,77,374 బోనస్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మద్దూరుపాడు, కావలి బ్రాంచి మేనేజర్ డి శ్రీనివాసులు, రైతులు, సంగం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


పాడిరైతులతో మాట్లాడుతున్న సంగం డెయిరీ జోనల్ మేనేజర్ వినోద్ కుమార్

అంగన్‌వాడీల్లో కుళ్లిన కోడిగుడ్లు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు తక్కువ పరిమాణం ఉన్న, కుళ్లిన కోడిగుడ్లను కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. ఏదో ఒక కేంద్రంలో తరచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నా.. సదరు కాంట్రాక్టరుపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. మండలంలో మొత్తం 53 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మూడేళ్ల లోపు పిల్లలు 929 మంది, ఆరేళ్ల లోపు పిల్లలు 589 మంది, గర్భిణులు 122 మంది, బాలింతలు 164 మంది ఉన్నారు. ఒక్కొక్కరికీ నెలకు 25 చొప్పున ప్రభుత్వం కోడిగుడ్లు పంపిణీ చేస్తోంది. అయితే ఐసీడీఎస్ అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్లకు ఆశపడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కోడి గుడ్డు నుండి పోషకాలు అందాలంటే.. బరువు 45 గ్రాముల నుండి 55 గ్రాములు ఉండాలని ప్రభుత్వం సూచించింది. కానీ కాంట్రాక్టర్లు సరఫరా చేసే కోడిగుడ్ల బరువు 40 గ్రాముల కన్నా తక్కువ ఉంటోంది. పైగా కుళ్లిపోయిన కోడిగుడ్లను సరఫరా చేస్తుండడం గమనార్హం. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన కోడి గుడ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పోలినేనిచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన కోడిగుడ్లు

పాఠశాల అభివృద్ధికి కృషి అభినందనీయం

లింగసముద్రం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి దాతలు కృషి చేయడం అభినందనీయమని ఎంఈఓ-2 శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెంగళాపురం పాఠశాలలో పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నారిబోయిన మునలయ్య విద్యార్థులకు సుమారు రూ.7 వేల విలువైన గుర్తింపు కార్డులను ఉచితంగా అందించారు. ఎంఈఓ శివకుమార్ మాట్లాడుతూ దాతలు అందించిన ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. మునలయ్యను ఆదర్శంగా తీసుకొని పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంఈఓ శివకుమార్, కాంప్లెక్స్ చైర్మెన్ యు మాధవరావు, మొగిలిచెర్ల, చినలాటరిపి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె సూర్యప్రకాశరావు, పి దామోదర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి ఎస్తేర్‌రాణి, ఉపాధ్యాయులు మునలయ్యను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేర్‌రాణిని కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి జనార్దన రావు, ఎం అన్నపూర్ణ, కొండలరావు, సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.


మునలయ్యను సన్మానిస్తున్న ఎంఈవో-2 శివకుమార్, ఉపాధ్యాయులు

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి చీర కట్టే విషయంలో ఏర్పడిన ఘర్షణ రెండు కుటుంబాల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఎస్సై అంకమ్మ కథనం మేరకు.. కొల్లూరుపాడు బీసీ యాదవ కాలనీలో దసరా ఉత్సవాలకు పోలేరమ్మకి తొలిరోజు చీర కట్టేందుకు అమ్మనబ్రోలు శ్రీనివాసులు, బాలయ్య కుటుంబ సభ్యులు, అదే గ్రామానికి చెందిన అమ్మనబ్రోలు ప్రసాదు, వెంకయ్య కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఆ సమయంలో ఉలవపాడుకు చెందిన మనోజ్‌కుమార్ నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. అమ్మనబ్రోలు శ్రీనివాసులు, బాలయ్యలు సదరు మనోజ్‌కుమార్‌కు మేనమామలు. కాగా ప్రసాదు, వెంకయ్యలతోపాటు వారి బంధువులు అమ్మనబ్రోలు రవి, కిరణ్‌కుమార్, అశోక్, మర్రిబోయిన శివశంకర్, అమ్మనబ్రోలు రమేష్‌లు సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తున్న మనోజ్‌కుమార్‌పైకి వచ్చారు. నువ్వు ఇక్కడి ఏందిరా మాట్లాడేది అంటూ కిరణ్, అశోక్ ఇద్దరు మనోజ్‌ను చేతులు పట్టుకోగా రవి గడ్డపారతో తలపై కొట్టాడు. కిరణ్‌కుమార్ కర్రతో మోకాళ్లపై కొట్టాడు. కిందపడిన మనోజ్‌ను మిగిన వాళ్లు కాళ్లుచేతులతో కొట్టారు. అక్కడే ఉన్న బంధువులు బాధితుడిని కారులో వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ నుంచి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, దాడిలో పాల్గొన్నవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేవీ శరవన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం

కావలి (టౌన్) సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవీ దేవీ శరవన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణ గ్రామదేవతగా పూజలందుకుంటున్న కలుగోళశాంభవీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, రాత్రి గజవాహన సేవతో గ్రామోత్సవం నిర్వహించారు. పాతూరు శివాలయంలో దుర్గాభ్రమరాంబ అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమివ్వగా రాత్రి దేవీ ఆలయ ఉత్సవం నిర్వహించారు కన్యకాపరమేశ్వరీ అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో, వడ్డిపాలెంలోని కనకదుర్గ అమ్మవారు కనకదుర్గా అలంకారంలో, విష్ణాలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు రాజ్యలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

● **అల్లూరు :** మండలంలోని అన్ని శక్తి ఆలయాల్లో సోమవారం నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అల్లూరులోని పోలేరమ్మ ఆలయం, పార్వతీ అమ్మవారి (దసరా దేవాలయం), కలుగోళమ్మ, గంగమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాలతోపాటు బీసీ కాలనీ సమీపంలోని వృక్ష పోలేరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృక్ష పోలేరమ్మను ప్రత్యేక పూలాలంకరణ గావించారు. అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలను చేపట్టారు. రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, సురేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **కందుకూరు :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని అంకమ్మతల్లి, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, కోదండ రామాలయంలో తూర్పు సాలిపాలెంలో పల్నాటి వీరుల అంకమ్మతల్లి మొదటి రోజు బాలా త్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు విద్యుద్దీపాలంకరణలతో నూతన శోభను సంతరించుకున్నాయి. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

● **ఉలవపాడు :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. విద్యుద్దీప కాంతులతో నూతన శోభను సంతరించుకున్నాయి. ఉలవపాడులోని అంకమ్మ, కనకదుర్గమ్మ, పోలేరమ్మ, గంగమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో నవరాత్రుల మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


కావలి టౌన్ బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో కలుగోళశాంభవి అమ్మవారు


కందుకూరు :బాల త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు


ఉలవపాడు : బాల త్రిపురసుందరి అవతారంలో కనకదుర్గమ్మ

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

కందుకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'మట్టిపాదం' కవయిత్రి, ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న జీ ఈశ్వరీభూషణంకు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో దన్యాసి మాల్యాద్రి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా 'భాష' పత్రిక సంపాదకులు విద్యాసాగర్, సీపీపల్లి ఎంఈవో సంజీవి, ఆర్ శ్రీనివాసులు, కందుకూరు, కావలి ఎంఈవోలు మనేపల్లి నాగకుమార్ శర్మ, కూనం సుబ్బారెడ్డి, బండి గోవిందయ్య హాజరయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, గురజాడ అప్పారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామం శాఖవరంలోని పేద కుటుంబంలో జన్మించిన ఈశ్వరీభూషణం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకుని, అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ముందుకెళుతుండడం అభినందనీయమన్నారు. బడిబయట ఉన్న పిల్లలను ఎందరినో బడిబాట పట్టించేలా ఆమె కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఈశ్వరీ భూషణంను అభినందించారు.



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు ఈశ్వరీభూషణం దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, బంధుమిత్రులు



నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయ భవనంలో మూటలు కట్టిపడేసిన పాతవస్తువులు



కు.ని నియంత్రణ శిక్షణ కేంద్రం వద్ద..



కలెక్టరేట్ వెనుక అడవిలా పెరిగిన పిచ్చి మొక్కలు

చి(చె)త్తశుద్ధి ఇదేనా!?

నెల్లూరు నగరంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం అయిందని గత శనివారం అధికారులు ప్రకటించారు. అయితే నగరంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మాత్రం చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు అలాగే ఉండి, అధికారుల చి(చె)త్తశుద్ధిని ప్రశ్నిస్తున్నాయి. ప్రధానంగా కలెక్టరేట్ వెనుకభాగంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. అలాగే రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోయి, మురుగునీటి నిల్వతో కంపు కొడుతూ, ప్రజా ఆరోగ్యానికి హానికరంగా తయారయ్యాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే జీజీహెచ్ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో కూడా చెత్తాచెదారం, పాత పరుపులు పోగిపడి, స్వచ్ఛాంధ్రను వెక్కిరిస్తున్నాయి. ఇప్పటికైనా వీటిని తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (నెల్లూరు, ఆంధ్రజ్యోతి)



రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట మురుగునీరు



జీజీహెచ్‌లోని ప్రసూతి ఆవరణలో చెత్తాచెదారం

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన

కలిగిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగుచేస్తున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గుచూపాలని వేలం నిర్వహణాధికారి శివకుమార్ సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయని, ధరల్లో హెచ్చుతగ్గులు సహజమన్నారు. పొగాకు సాగుచేస్తున్న రైతులు కొంతమేర అయినా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేస్తే ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశముంటుందన్నారు. బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే పొగాకు సాగుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్మిక చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి

● 8 గంటల పని విధానాన్నే అమలు చేయాలి

● సీఐటీయూ డిమాండ్



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కార్మిక చట్ట సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద నిరసన ప్ర దర్శన జరిగింది. వారు మాట్లాడుతూ కార్మిక చట్ట సవరణ బి ల్లు వల్ల యాజమాన్యాలు కార్మికులను బానిసలుగా చూసే అ వకాశం ఉందన్నారు. బ్రిటీష్ వలస పాలకులను ఎదిరించి సా ధించుకున్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలు చేయటం ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గంపై దాడి పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీని అమలుకు పూనుకోవటం కార్మికులకు ద్రోహం చేయటమేనన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కార్మికుల బిల్లు సవరణకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులు, బాబూ రావు, అశోక్, కామాక్షమ్మ, మూలం ప్రసాద్, మధు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

● ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై విమర్శలు

● ఉదయగిరి-నందవరం, సంగం-కలువాయి రోడ్డు టెండర్లు రద్దు

● సింగిల్ టెండర్ పేరుతో క్యాన్సిల్.. మళ్లీ సెకండ్ కాల్

● నెల రోజుల క్రితం ఇదే సింగిల్ టెండర్లు ఆమోదం



గుంతలమయంగా ఉన్న నందవరం-ఉదయగిరి రోడ్డు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న విధంగా తయారైంది ఆర్‌అండ్‌బీ శాఖలో పరిస్థితి. దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు నాన్పుడు ధోరణి ప్రదర్శిస్తున్నారు. కొన్ని రోడ్ల విషయంలో ఒకలా, మరికొన్ని రోడ్ల విషయాల్లో మరోలా నిబంధనలు మారుస్తూ వివాదాలకు తెరలేపుతున్నారు. తద్వారా రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఫలితం లేకుండా పోతోంది.

నెల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నందవరం-ఉదయగిరి, సంగం-కలువాయి రోడ్లు కొన్ని చోట్ల దారుణంగా దెబ్బతిని ఉన్నాయి. ఈ రోడ్లను బాగు చేయాలని ఐదేళ్ల నుంచి ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అనేక జిల్లా పరిషత్ సమావేశాల్లోనూ ఈ రోడ్ల దుస్థితిని ప్రజాప్రనిధులు ప్రస్తావించారు. ఈ గుంతల్లో పడి పలు ప్రమాదాలు కూడా జరిగాయి. ఈ రెండు రోడ్లు కీలకమైన కనెక్టివిటీ రహదార్లు. ఈ రోడ్లతో పాటు మరి కొన్ని రోడ్లను బాగు చేయాలని జిల్లా నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. వాటిని పరిశీలించిన ప్రభుత్వం జిల్లాకు సుమారు రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. కొన్ని ఎండీఆర్ వర్కులు కాగా మరికొన్ని స్టేట్ హైవేస్ ఉన్నాయి. ఎండీఆర్ వర్కులకు జూలై నెలలో టెండర్లు పూర్తి చేశారు. ఆ సమయంలో రోడ్ల దుస్థితి దృష్టిలో పెట్టుకొని అధికారులు సింగిల్ టెండర్ వచ్చినా కూడా ఆమోదించారు. అయితే ఇటీవల పిలిచిన స్టేట్ హైవేస్ విషయంలో మాత్రం సింగిల్ టెండర్లను ఆమోదించలేదు. నందవరం-ఉదయగిరి, సంగం-కలువాయి రోడ్లకు ఒక్కొక్క కాంట్రాక్టర్ మాత్రమే టెండర్ వేశారు. దీంతో ఈ రెండు టెండర్లను రద్దు చేసిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పుడు రెండో కాల్ పిలిచారు. అయినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే ఆ రెండు రోడ్లను ఎలా బాగు చేస్తారంటే మాత్రం ఆర్‌అండ్‌బీ అధికారుల నుంచి సమాధానం లేదు. అసలే చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు కొత్తగా పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వంలో అసలు ఒక్కరు కూడా టెండర్లు వేయకపోవడంతో రద్దయిన వర్కులు అనేకం ఉన్నాయి. అటువంటి పరిస్థితుల్లో రోడ్లను వీలైనంత వేగంగా బాగు చేయాలన్న ఆలోచన దిశగా ఆర్‌అండ్‌బీ అధికారులు అడుగులు వేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా దీనిపై వివరణకై ఆర్‌అండ్‌బీ ఎస్ఈ గంగాధర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

● కలెక్టర్ హిమాన్షు శుక్లా ● పీజీఆర్ఎస్‌కు 524 అర్జీలు



తిక్కన భవన్ బయట ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం వహించరాదని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు హాజరయ్యారు. అర్జీల రూపంలో సమస్యలు స్వాగతం పలికాయి. కలెక్టర్‌కు 524 మంది అర్జీలు సమర్పించారు. వాటిలో 180 రెవన్యూశాఖకు సంబంధించి ఉన్నాయన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించా రు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● ఏర్పాట్ల పరిశీలన

అర్జీలు స్వీకరించే ముందు కలెక్టరేట్ తిక్కన ప్రాంగణం వెలుపల అర్జీదారులకు అందుతున్న సేవలను కలెక్టర్ శుక్లా పరిశీలిం చారు. షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అర్జీదా రులకు అర్జీలు ఉచితంగా రాసిపెట్టాలని ఆదేశించారు.

● తమను పాఠశాలల నుంచి రిలీవ్ చేయాలని కోరుతూ పలు వురు ఉపాధ్యాయులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. తాము ఈ ఏడాది జూన్ 16న బదిలీ అయ్యామని, తాము పనిచేస్తున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవటం వల్ల అక్కడే కొనసాగుతున్నామని చెప్పారు. తక్షణం రిలీవ్ చేయాలని కోరారు.

● ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

నెల్లూరు(విద్య) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం దసరా సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చ ర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షారూఖ్ కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇ చ్చారు. అన్నీ పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు మాత్రం తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తు న్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆశిర్, అన్వర్‌మస్తాన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రా ష్ట్ర ఇన్‌చార్జి నూకాలమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వితపు లలితారాం డిమాండ్ చేశారు. సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ కమిటీ సమావేశం నగరం లో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేరరుల సమావేశంలో లలితారాం మాట్లాడారు. 9 నెలలుగా జిల్లాలో తమ సంఘం అనేక కార్యక్రమాలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. ఇటీవల ఎన్నికైన సంఘం జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం దక్షిణ రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం, రాష్ట్ర కార్యదర్శి రాజు, రాష్ట్ర నాయకుడు ఆదిశేషు, జిల్లా అధ్యక్షుడడు సమాధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిన్న బజారు పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై సోమవారం కేసులు నమోదయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. కలువాయి ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని వీఆర్సీ కూడలిలోని ఓ కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతోంది. ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న ఆ విద్యార్థిని ఈ నెల 21వ తేదీ సాయంత్రం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వార్డన్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. చుట్టుపక్కల గాలించినా విద్యార్థిని ఆచూకీ తెలియక పోవడంతో సోమవారం తండ్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లుకు చెందిన మరో విద్యార్థిని నగరంలోని వాహెబ్‌పేటలో ఓ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం హాస్టల్ నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు లారీల్లోనే బియ్యం

● నిర్ధారించిన పౌరసరఫరాల శాఖ

● నేడు స్వాధీనం చేసుకోనున్న అధికారులు

● రాజకీయంగా దుమారం రేగే అవకాశం



సివిల్ సప్లయ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం లారీలు

నెల్లూరురూరల్,సెప్టెంబరు 22,(ఆంధ్రజ్యోతి) : బియ్యం లారీల గుట్టు రట్టైంది. పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదివారం పట్టుబడిన ఐదు లారీల్లో రెండు లారీల్లోనే రేషన్ బియ్యం ఉన్నట్లు ఆ శాఖ తేల్చింది. ఆది, సోమవారాల్లో సేకరించిన బియ్యం నమూనాలను పరీక్షలకు పంపగా, వాటి ఫలితాలు సోమవారం రాత్రి వెలువడ్డాయి. ఐదు లారీల్లోని రెండు లారీల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు అందిన ఫలితాల ద్వారా వెల్లడైందని పౌరసరఫరాల శాఖలోని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఆ లారీలను మంగళవారం గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని 6ఏతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. మిగిలిన మూడు లారీల్లోని బియ్యం ఆధారాలను పరిశీలించి విడుదల చేస్తామని వివరించారు. ఐదు లారీల్లో 150 టన్నుల వరకు బియ్యం లోడై ఉన్నట్లు గుర్తించిన అధికారులు, తాజాగా తేల్చిన లెక్కల ప్రకారం రెండు లారీల్లో 60 టన్నుల వరకు రేషన్ బియ్యం ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ లెక్కన వాటి విలువ టన్నుల రూ. 46 వేల చొప్పున 60 టన్నులు రూ. 27.60 లక్షల వరకు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. మంగళవారం రంగంలోకి దిగే పౌరసరఫరాల శాఖ వీటి పూర్తి వివరాలను బహిర్గతం చేయనున్నది. ఈ విషయం రాజకీయంగా దుమారం రేగనున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.



పరీక్షలకు సేకరించిన బియ్యం నమూనాలు

ముగిసిన నామినేషన్ల గడువు

● మూడు డైరెక్టర్ పదవులకు ఐదు నామినేషన్లు

● నేటితో ఉపసంహరణ గడువు పూర్తి



నామినేషన్ దాఖలు చేస్తున్న సాయినిరోషా

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాల ఉత్పత్తుల పరస్పర సహాయ సహకార సమితి (విజయ డెయిరీ)లో బోర్డు డైరెక్టర్ల ఎన్నికలకు సోమవారం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎ న్నికల అధికారి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ అయిన మూడు స్థానాలకు గూడూరు మండల సంతదాసుపల్లి పాల సొసైటీ అధ్యక్షుడు ఇనుకుర్తి మల్లికార్జున నాయుడు, ఇందుకూరుపేట మండలం మైపాడు సొసైటీ అధ్యక్షుడు కాకుటూరు చంద్రశేఖర్‌రెడ్డి, కొడవలూరు మండలం రేగడిచలిక పాల సొసైటీ అధ్యక్షురాలు గుర్రం నాగేశ్వరమ్మ, అల్లూరు మండలం బీరంగుంట సొసైటీ అధ్యక్షుడు పొంకం హరిబాబు, బాలాయపల్లి మండలం వెంగమాంబాపురం సొసైటీ అధ్యక్షురాలు సూదలగుంట సాయినిరోషా తమ నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం ఈ ఐదుగురి నామినేషన్లను అనుమతిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉందని తెలిపారు. ఆ తరువాత కూడా ముగ్గురు కంటే ఎక్కువమంది బరిలో ఉంటే ఈనెల 27 ఎన్నికలలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రుణం పేరుతో రూ.2.9 లక్షల మోసం

● ఆర్డీవోకి బాధిత మహిళ ఫిర్యాదు

కావలి,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): నమ్మకంగా తన ఇంటిలో రెండేళ్లు పాచిపని చేయించుకుని, ఆయన్ను నమ్మకోవటంతో తమకు సాయం చేయటం మరిచి రుణం పేరుతో రూ.2.9లక్షలు మోసం చేసాడని కావలిరూరల్ మండలం సిరిపురం గ్రామానికి చెందిన జంగిలి ప్రిస్కిల్లా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు ఆమె ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణకు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. తన తల్లి జలదంకి ఎలీషమ్మ కావలి కొత్త బజారులో ఉన్న దుగ్గి రమేష్ ఇంటిలో పాచిపని చేస్తూ ఎంతో న మ్మకంగా ఉండేదన్నారు. దీంతో ఆయన బ్యాంకు నుంచి ముద్రా రుణం రూ.2లక్షలు ఇప్పించి ఆయనే వాడుకున్నాడని పేర్కొంది. రెండు వాయిదాలు బ్యాంకుకు ఆయనే డబ్బులు కట్టాడని, ఎస్సీ కార్పొరేషన్ నుంచి రు.5లక్షలు రుణం ఇప్పిస్తాన ని, అందుకు రూ.90 వేలు ఖర్చు అవుతోందని తీసుకున్నాడని తెలిపారు. ఆ రు ణం ఇప్పించకుండానే ముద్రా రుణం వాయిదాలు చెల్లించకుండానే ఆయన కా వలి వదిలి నెల్లూరుకు కాపురం మార్చారని చెప్పారు. దీంతో బ్యాంకు వారు ము ద్రా రుణం వాయిదాలు కట్టమని తమ వద్దకు వస్తుండటంతో వాటిని కడుతున్నామన్నారు. ముద్రా రుణం వాయిదాల విషయం, ఎస్సీ కార్పొరేషన్ రుణం కోసం ఇచ్చిన రూ.90 వేల విషయం ఆయన్ను అడగ్గా, ఫోన్‌లో బూతులు తిట్టారని బాధితురాలు పేర్కొన్నారు. ఆ తర్వాత కొంత కాలానికి అసలు మా ఫోన్‌లు ఎత్తడం మానేశాడని వాపోయారు. దీంతో తాము పోలీసులకు పిర్యాదు చేసినా స్పందన లేక పోవటంతో ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు.

తమిళ బోట్లను అడ్డుకోవడమే లక్ష్యం

● ఆంధ్ర మత్స్యకారులకు చిక్కిన మరో బోటు

● తాడో పేడో తేల్చుకుందాం అంటున్న తీరప్రాంత మత్స్యకారులు



ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న చెన్నై మెటనైజ్డ్ బోట్లు

బిట్రగుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కడలూరు, కారైకల్ మెటనైజ్డ్ బోట్ల దూకుడును ఆంధ్ర మత్స్యకారులు అడ్డుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఇటీవల 160 తీర ప్రాంత మత్స్యకారులు ఏకమై తమిళ మత్స్యకారుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు తీర్మానం చేశారు. అయితే, కొంతమంది పెద్దలు వీరిని శాంతి పరిచేందుకు ప్రయత్నించినా ససేమీరా అన్నారు. ఈ నెల 19వ తేదీన తిరుపతి జిల్లా వాకాడు తీరప్రాంతంలో చేపల వేటకు వచ్చిన తమిళనాడు బోటును స్థానిక మత్స్యకారులు గుర్తించారు. పథకం ప్రకారం జువ్వలదిన్నె మత్స్యకారుల ఆధీనంలో ఉన్న కడలూరు బోటులో వెళ్లి ఆ బోటును అడ్డుకున్నారు. అనంతరం అక్కడ నుంచి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు తరలించారు. అల్పపీడన ప్రభావంతో సముద్రం ఉండే కసురుకన్నా మరింత ఎక్కువగా గంగపుత్రులు అక్రమ దారులపై కసిగా ఉన్నారు. దీంతో అటు మెరైన్ ఇటుపోలీసులు ఏమి చేయలేని పరిస్థితి నెలకొని ఉంది. ఇక నుంచి కడలూరు, కారైకల్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల ఆట కట్టించడానికి ఇదే సరైన మార్గమని గంగపుత్రులు ఎంచుకున్నారని పెద్దలు అంటున్నారు.

జీఎస్టీ పన్ను తగ్గింపు పట్ల హర్షం.. నేతలకు పాలభిషేకం

కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా జీఎస్టీ పన్నులు తగ్గించడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని రియలన్స్ మాల్ వద్ద ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. జీఎస్టీ భారం తగ్గడంతో పేద, మధ్యతరగతి కుంటుబాలకు ఎంతో ఊరట కలుగుతోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఘట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, దామా మల్లేశ్వరరావు, తిరుపాలు, వంశీ పాల్గొన్నారు.

విచారణ జరిపి న్యాయం చేస్తాం

● ఎస్పీ డాక్టర్ అజిత



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. సోమవారం నెల్లూరులోని ఉమేషచంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఎస్పీ పాల్గొని బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారిగా వ్యవహరిస్తూ అర్జీలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి 122 ఫిర్యాదులు అందాయి.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కి వినతి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పెద్దఎత్తున నినాదాలతో ప్రభుత్వంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జేఏసీ ఛైర్మన్ కే శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను దీర్ఘకాలంగా పరిష్కరించలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు.లేకుంటే భవిష్యత్తులో మరింత పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు దామోదర్, అల్తాఫ్, శ్రీనివాసులు, నజీర్‌ఖాన్, వెంకటేశ్వర్లు, రఫీ, నవాబ్ జాన్, కాంట్రాక్ట్ యూనియన్ నేతలు హజరత్ వలి, కృష్ణ, నవీన్, రమణారెడ్డి, నాంచారయ్య, ప్రసాద్, ఫిరోజ్, సంతోష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు